# ప్రజా తపన

prajathapana.com

News that matters




**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

**- స్వామి వివేకానంద**


సంపుటి :01 సంచిక:80 బుధవారం 10 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభం

**ప్రజా తపన ,విజయవాడ:**

ప్రతి సమస్యకు పరిష్కారం వెతికే దిశగా పాలన సాగుతోందని, వ్యవస్థలో మార్పు తీసుకు వచ్చేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ప్రతీ మంచి పనికి కూడా మాకు ఎంతిస్తారనే గుణం టీడీపీది అని విమర్శలు గుప్పించారు. టీడీపీ హయాంలో ఇళ్ల పట్టాలు ఇచ్చిన దాఖలాలు కూడా లేవని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి చెందిన వ్యక్తులకు మాత్రమే సంక్షేమ పథకాలు ఇచ్చేవారని ఆరోపించారు. అలాగే గత ప్రభుత్వ పాలనలో అడుగడుగునా వివక్ష ఉండేదని, తన పాదయాత్రలో ప్రజల సమస్యలను గమనించినట్లు సీఎం జగన్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు పథకాలు అందాలని, వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించే ఉద్దేశంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళ వారం రోజే శ్రీకారం చుట్టారు. క్యాంపు కార్యాలయం



నుంచి ఈ కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కోసం ప్రత్యేకంగా 1902 టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేశారు.జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల పరిషత్ కార్యాలయాలతో పాటు గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని జడ్పీ సీఈఓలు, డీపీఓలకు పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. స్థానిక జడ్పీటీసీకి ఈ సమాచారాన్ని అంద జేయడంతో పాటు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని పేర్కొంది. గ్రామ సచివాలయాల్లో నిర్వహించే కార్యక్రమానికి స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలకు ఆహ్వానించాలని సూచించింది. అలాగే ప్రతీ వినతి పరిష్కారం అయ్యే వరకూ ట్రాకింగ్ ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో మీకు ఎదురయ్యే సమస్యలకు మరింత మెరుగైన, నాణ్యమైన పరిష్కారం చూపాలన్న తపనతో ఈ కార్యక్రమం నడుస్తుంది. వైసీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షమ పథకాలు అందుకోవడంలో ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని సూచించారు. ఆరోగ్య శ్రీ సేవలు అందుకోవడంలో, రెవెన్యూ కార్డులకు, ప్రభుత్వ సేవలకు సంబంధించి మరే ఇతర వ్యక్తిగత ఇబ్బందులు ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్ 1902 కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. అయితే దానికి కాల్ సెంటర్ ప్రతినిధి సర్వీస్ రిక్వెస్ట్ ఐడీని కేటాయిస్తారు. అప్పటి నుంచి సమస్య ఎస్ఎంఎస్ విధానం ద్వారా అప డేట్ అవుతుంది. దాన్ని బట్టి మీ సమస్య ఎంత వరకు పరిష్కారం అయిందో తెలుస్తుంది. ఇలా మనం ఫిర్యాదు చేసినప్పటి నుంచి సమస్య పూర్తిగా తీరే వరకూ ఇది నడుస్తూనే ఉంటుంది. రాష్ట్ర ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని సీఎం జగన్ సూచించారు.



# మణిపూర్ లో కొనసాగుతున్న ఉద్రిక్తత

**ప్రజా తపన ,ఇంఫాల్**

గత నాలుగైదు రోజులుగా ఈశాన్య భారత రాష్ట్రం మణిపూర్ మండుతోంది.మూడు తెగల మధ్య చెలరేగిన ఘర్షణల కారణంగా మణిపూర్ రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతోంది.ముందుగా ఈ ఘర్షణలను ఆపి, శాంతి నెలకొల్పేందుకు ఈశాన్య రాష్ట్రాల శాంతి భద్రతలను పరిరక్షించే అసొం రైఫిల్ దళాలు యత్నించాయి. సుమారు 55 పటాలాల బలగాలు రంగంలోకి దిగినా పరిస్థితి అదుపులోకి రాలేదు. దాంతో కేంద్ర ప్రభుత్వం రాపిడ్ యాక్షన్ ఫోర్సెస్ భారీ ఎత్తున మణిపూర్ రాష్ట్రానికి తరలించింది. ఆర్మీని కూడా రంగంలోకి దింపింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు కర్ఫ్యూ విధించారు. చాలా ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. కానీ, ఆందోళనకారులు తమ పంథాను మార్చి మరీ రాష్ట్రాన్ని తగుల బెడుతున్నారు. ఆస్తుల విధ్వంసం, ఆస్తులకు, వాహనాలకు నిప్పు పెట్టడం వంటివి పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి .దీంతో అక్కడ విద్వంసకర పరిస్థితి కొనసాగుతోంది.ఏ దిక్కు చూసిన ఆందోళ నకర పరిస్థితిలు కొనసాగుతున్నాయి.



# ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్

## ఇస్లామాబాద్‌లో ఉద్రిక్తత

**ప్రజా తపన , ఇస్లామాబాద్ :**

పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి, పీటీఐ చీఫ్ ఇమ్రాన్ ఖాన్‌ను పాకిస్థాన్ రేంజర్లు అరెస్ట్ చేశారు. ఇస్లామాబాద్ హైకోర్ట్ ఆవరణలో ఆయన్ను అరెస్ట్ చేశారు. అల్ కాదీర్ ట్రస్ట్ అవినీతి కేసులో అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇమ్రాన్ అరెస్ట్ సమయంలో కోర్టులో ఘర్షణ జరిగింది. దీంతో ఇమ్రాన్ లాయర్లకు గాయాలయ్యాయి. ఇమ్రాన్‌కు కూడా గాయాలయ్యాయని పీటీఐ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఇమ్రాన్‌ను పాక్ రేంజర్లు రహస్యప్రాంతానికి తరలించారు.ఇమ్రాన్ అరెస్ట్‌తో ఇస్లామాబాద్‌తో పాటు పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు ఇమ్రాన్ మద్దతుదారులు కోర్టు బయట, దేశంలోని పలు పట్టణాల్లో విధ్వంసానికి దిగారు. పాకిస్థాన్ ముస్లిం లీగ్ - నవాజ్ పార్టీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం తనపై కుట్ర చేస్తోందని ఇమ్రాన్ ఆరోపి స్తున్నారు. ఎలాగైనా తనను

02

# హైదరాబాద్‌లో రెండు నిమిషాలపాటు అద్భుతం ఆవిష్కృతం

**12.12 నుంచి 12.14వరకు మాయమైన నీడ**

**ప్రజా తపన ,హైదరాబాద్ :**

ఇవాళ 12.12 గంటలకు ప్రపంచానికే షాకిచ్చే ఒక విషయం జరిగింది. విచిత్రంగా నీ నీడ నీకు దూరమైంది.. ఎలా? ఇది ప్రకృతిమాత ఇంద్రజాలమా? లేక? సైన్స్ అండ్ టెక్నాలజీ ఫలితమా..? జీరో షాడో డే? మీ నీడ మిమ్మల్ని వదిలిపెట్టే రోజు. రెండు నిమిషాల పాటు మీ నీడ మీనుంచి మాయమయ్యే రేర్ అండ్ రేరెస్ట్ డే జరిగింది. ఏడాదిలో కేవలం రెండుసార్లు మాత్రమే ఆవిష్కృతమయ్యే ఈ ఖగోళ అద్భుతానికి ఈసారి హైదరాబాద్ నగరం వేదికైంది. ఎప్పుడూ మనల్ని వెంటాడే నీడ.. మనకు దూరమవడం అనే అరుదైన అనుభూతిని ఆస్వాదించే అవకాశం కేవలం మనకు మాత్రమే దక్కింది. లెటజ్ గో ఇన్‌టూ



డీటెయిల్స్.మధ్యాహ్నం వరకు పడమర వైపు, మధ్యాహ్నం తర్వాత తూర్పు వైపు.. మనల్ని వెంటాడే నీడ మనకు తెలుసు. సూర్యుడు నడినెత్తినెక్కినప్పుడు, మిట్టమధ్యాహ్నం 12 గంటల సమయంలో కూడా ఎంతోకొంత నీడ కనిపిస్తూనే ఉంటుంది. సూర్యుడు సరిగ్గా మన పైనుంచి కాకుండా మన పక్కనుంచి జారుకుంటాడు గనుక.. అటో ఇటో ఎటోవైపు నీడ తప్పనిసరిగా కనిపిస్తుంది. కానీ.. ఏడాదిలో రెండేరెండు సందర్భాల్లో సూర్యుడు సరిగ్గా మన నెత్తి మీదకే వచ్చేస్తాడు. అంటే.. భూగ్రహం మూమెంట్‌కీ, సూర్యుడి కదలికకూ 90 డిగ్రీలతో పర్‌ఫెక్ట్ వర్టికల్ పొజిషన్ ఏర్పడుతుంది. ఆ కచ్చితమైన స్థానం ఈసారి హైదరాబాద్దైంది. కమాన్.. సెలబ్రేట్.. జీరో షాడో డే.. అంటూ హైదరాబాదీలు

02

# ఇవాళ టెన్త్ ఫలితాలు

**ప్రజా తపన ,హైదరాబాద్:**

తెలంగాణలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి పేరెంట్స్ ఎదురు చూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. టీఎస్ టెన్త్ ఫలితాలను బుధవారం విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని అధికారులు అధికారికంగా ప్రకటించారు. మంగళవారం తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో పదో తరగతి పరీక్షా ఫలితాలను విడుదల చేయనున్నట్లు

02

# తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

**బాలికలదే పై చేయి**

**బాలికల ఉత్తీర్ణతాశాతం 71.57**

**కాగా.. బాలుర ఉత్తీర్ణతాశాతం**

**55.60.**

**ఫస్ట్ ఇయర్ 63, సెకండ్ ఇయర్ 67**

**శాతం పాస్**

**ప్రజా తపన ,హైదరాబాద్:**

తెలంగాణలో ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలు మే 9న విడుదలైన సంగతి తెలిసిందే. విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి నాంపల్లిలోని ఇంటర్మీడియట్



కార్యాలయంలో ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్‌లో 63.85 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, సెకండియర్‌లో 67.26 శాతం ఉత్తీర్ణులయ్యారు. తెలంగాణ ఇంటర్ సెకండ్ ఇయర్

02

# హైదరాబాద్ లో ఉగ్రకదలికలు

**ప్రజా తపన ,హైదరాబాద్:**

హైదరాబాద్‌లో మళ్లీ ఉగ్ర కదలికల కలకలం చోటుచేసుకుంది. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ 16మందిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిలో భోపాల్ కు చెందిన 11 మంది, హైదరాబాద్ కు చెందిన ఐదుగురు ఉన్నారు. మధ్య ప్రదేశ్, తెలంగాణ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి 16మందిని అరెస్ట్ చేశారు. అరెస్టైన వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, ల్యాప్ టాప్ లు, కత్తులు, అలాగే ఇస్లామిక్ జిహాదీ సాహిత్యాన్ని స్వాధీనం



02





**ప్రజా తపన ,**

**విధులకు తరలుతున్న ఎన్నికల సిబ్బంది. 224 అసెంబ్లీ స్థానాలకు రేపు ఎలక్షన్ జరగనున్నది. అందులో భాగంగా ఎన్నికల సిబ్బంది తరలుతున్న దృశ్యాలు.**

# హైదరాబాద్‌లో రెండు నిమిషాలపాటు అద్భుతం ఆవిష్కృతం

(మొదటిపేజీ తరువాయి)

ఎంజాయ్ చేశారు.సరిగ్గా 12 గంటలా12 నిమిషాలకు సూర్య కిరణాలు నిట్టనిలువుగా హైదరాబాద్ నగరాన్ని తాకాయి. ఈ సమయంలో ఏ వస్తువు నీడ కూడా భూమిపై పడలేదు. హైదరాబాదీలు మాత్రమే ఎక్స్‌పీరియన్స్ దక్కించుకున్నారు. మన హైదరాబాదీలకు రేరెస్ట్ అనుభవం ఇది.ఇలా మాయమైన నీడ.. సుమారు రెండు నిమిషాల తర్వాత మళ్లీ ప్రత్యక్షమైంది. కర్కాటక రాశి నుంచి సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే సమయంలో సూర్యకిరణాలు ఇలా నిట్టనిలువుగా భూమిని తాకుతాయని ఖగోళ భౌతిక శాస్త్రం చెబుతోంది. ఈ ఘటన తర్వాతే ఉత్తరాయణం గతించి దక్షిణాయనం మొదలవుతుందట .భారతీయులలో కొన్నిచోట్ల దీన్ని భాస్కర్ జయంతి పేరుతో సెలబ్రేట్ చేసుకుంటారు కూడా. మళ్లీ ఇదే ఏడాది ఆగస్టు 18న జీరో షాడే దేని ఎక్స్‌పీరియన్స్ చెయ్యొచ్చట. సో తోడూ నీడ అనే మాట కూడా ఒక్కోసారి అబద్ధం అవుతుందన్నమాట.

# హైదరాబాద్ లో ఉగ్రకదలికలు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నారు.మధ్యప్రదేశ్ పోలీసులకు అందిన స్పష్టమైన సమాచారంతో ఈ దాడులు జరిగినట్లుగా తెలుస్తోంది. కొంత కాలంగా వీరు కొన్ని ఉగ్రవాద సంస్థల వ్యవహారాలపై ఆకర్షితులై.. ఆయా సంస్థల్లో చేరాలన్న పట్టుదలతో గ్రూపుగా ఏర్పడి హైదరాబాద్ నుంచి ప్రయత్నాలు చేస్తున్నట్లుగా అనుమనిస్తున్నారు. గతంలో ఇలాగే హైదరాబాద్ నుంచి కొంత మంది సిరియా వెళ్లి ఐసిస్‌లో చేరే ప్రయత్నాలు చేసినట్లుగా ప్రచారం జరిగింది. కొంత మందిని యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, ఎన్ఐఏ వంటి సంస్థలు పట్టుకున్నాయి. ఆ తర్వాత అంతర్జాతీయంగా ఐసిస్‌తో పాటుఇతర ఉగ్రవాద సంస్థలు బలహీనపడ్డాయి. ఆ తర్వాత హైదరాబాద్ నుంచి కూడా ఇలాంటి వార్తలు తగ్గిపోయాయి. హఠాత్తుగా ఇప్పుడు ఏకంగా పదహారు మందిని అరెస్ట్ చేయడం కలకలం రేపుతోంది.గత ఏడాది ఏప్రిల్‌లో ఐసిస్ ఉగ్రవాద సంస్థ సానుభూతిపరుడిని అరెస్ట్ చేశారు. పాతబస్తీకి చెందిన సులేమాన్ అనే ఐసిస్ సానుభూతిపరుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఐసిస్ కు మద్దతుగా, ఐసిస్ భావజాలాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాడు. సులేమాన్ పేరుతో 20 సోషల్ మీడియా ఖాతాలను పోలీసులు గుర్తించారు. ఐపీ అడ్రస్ ఆధారంగా పోలీసులు సులేమాన్ ను అరెస్ట్ చేశారు. దేశంలో ఐసిస్ కదలికల్ని నాలుగు రోజుల క్రితం గుర్తించాయి భద్రతా బలగాలు. ఈనేపథ్యంలో హైదరాబాద్ లో సానుభూతిపరుడిని అరెస్ట్ చేయడం సంచలనం కలిగించింది. టెలిగ్రామ్, ఇన్ స్టాగ్రామ్ ద్వారా ఐసిస్ కు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. అమెరికాకు వ్యతిరేఖంగా ఐసిస్ తరుపున యుద్ధం చేయాలంటూ.. కామెంట్స్ పెడుతున్నాడు. అతన్ని అరెస్ట్ చేసిన తర్వాత ఇంకా దేశంలో ఐసిస్ మాడ్యూల్స్ ఉన్నాయన్న అనుమానంతో ప్రత్యేకంగా నిఘా పెట్టారు.ప్రస్తుతం జంట నగరాల్లో ఎలాంటి ఉగ్రవాద కదలికలు లేవని పోలీసులు చెబుతున్నారు. అరెస్ట్ అయిన వారంతా భోపాల్ నుంచి వచ్చిన వారేనని భావిస్తున్నారు. షెల్టర్ కోసమో లేకపోతే.. ఎవరి దృష్టి పడకుండా ఉండటానికో హైదరాబాద్ వచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. అయితే ఈ అంశాన్ని తేలికగా తీసుకోవాలని భద్రతా సంస్థలు అనుకోవడం లేదు. పూర్తి స్థాయిలో నిఘా పెడుతున్నాయి. అంతర్గత భద్రత విషయంలో కేంద్రం ఎలాంటి చిన్న అనుమానం వచ్చినా ఎవర్నీ వదిలి పెట్టడం లేదు.

# తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

ఫలితాల్లో 1,73,61 మందికి గ్రేడ్-ఎ వచ్చింది. ఇక 54,776 మంది విద్యార్థులకు గ్రేడ్-బి వచ్చింది. సెకండ్ ఇయర్‌లో మొత్తం 2,56,241 మంది ఉత్తీర్ణత సాధించారు.జిల్లాలవారీగా చూస్తే ఫస్టియర్ ఫలితాల్లో మేడ్చల్ (75.27 %) మొదటి స్థానం, రంగారెడ్డి (72.82 %), కొమరంభీమ్ ఆసిఫాబాద్ (72.96%) మొదటి మూడుస్థానాల్లో నిలిచాయి. అదేవిధంగా సెకండియర్ ఫలితాల్లో ములుగు (85.08 %), కొమరంభీమ్ ఆసిఫాబాద్ (80.16 %), మేడ్చల్(72.27 %) జిల్లాలు మొదటి మూడుస్థానాల్లో నిలిచాయి .

ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 4 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి సబితా తెలిపారు. ఫెయిల్ అయిన ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు ఆందోళన చెందవద్దని ఆమె సూచించారు. ముఖ్యంగా సెకండియర్ విద్యార్థులు టెన్షన్ పడొద్దని, తల్లిదండ్రులు కూడా వారి పరిస్థితి అర్థం చేసుకోవాలని, పిల్లలపై కోపడవద్దని కోరారు. ఫలితాలపై సందేహాలున్న విద్యార్థుల సౌలభ్యం కోసం రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు సబితా వెల్లడించారు. పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 4 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులపై ఒత్తిడి ఉండకూడదనే ఈ సారి ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ తొలగింపు.తెలంగాణలో ఈ ఏడాది మార్చి 15 నుంచి ఏప్రిల్ 5 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 9.47 లక్షళ మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో మొదటి సంవత్సరం 4,33,082 మంది రాస్తే 2,72,208 మంది పాస్ అయ్యారు. ఫస్ట్ ఇయర్‌లో 62.85 శాతం మంది పాస్ అయ్యారు. ఇందులో ఏ గ్రేడ్ లక్షా 60 వేల మందికి వస్తే బి గ్రేడ్ 68వేల 330 మంది పాస్ అయ్యారు. బాలికలు 2,17454 మంది పరీక్ష రాస్తే లక్షా 1,49729 మంది పాస్ అయ్యారు.

**జూన్ 4 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలT**

తెలంగాణలో ఎంసెట్ వార్షిక పరీక్షల ఫలితాలు మే 9న విడుదలైన సంగతి తెలిసిందే. విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి నాంపల్లిలోని ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్‌లో 63.85 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, సెకండియర్‌లో 67.26 శాతం ఉత్తీర్ణులయ్యారు. తెలంగాణ ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో 1,73,61 మందికి గ్రేడ్-ఎ వచ్చింది. ఇక 54,776 మంది విద్యార్థులకు గ్రేడ్-బి వచ్చింది. సెకండ్ ఇయర్‌లో మొత్తం 2,56,241 మంది ఉత్తీర్ణత సాధించారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ఏ జిల్లా టాప్- ఏ జిల్లా ఉత్తీర్ణత పడిపోయింది?

తెలంగాణలో ఎంసెట్ వార్షిక పరీక్షల ఫలితాలు ఇవాళ (మే 9న) విడుదలయ్యాయి. విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి నాంపల్లిలోని ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్‌లో 63.85 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, సెకండియర్‌లో 67.26 శాతం ఉత్తీర్ణులయ్యారు.

# ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

కేసుల్లో ఇరికించాలని, హత్య చేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని అరెస్ట్‌కు ముందు ఇమ్రాన్ వీడియో సందేశం సోషల్ మీడియాలో విడుదల చేశారు.అటు ఇమ్రాన్‌పై 85 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని కేసుల్లో ఇప్పటికే బెయిల్ రాగా మరికొన్ని కేసుల విచారణ కొనసాగుతోంది.పాకిస్థాన్ ముస్లిం లీగ్ - నవాజ్ పార్టీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ఖాతరు చేయడం లేదని ఇమ్రాన్ ఇటీవలే ఆరోపించారు.

మరోవైపు మూడు టెర్రరిజం కేసుల్లో ఇమ్రాన్‌కు లాహోర్ యాంటీ టెర్రరిజం కోర్టు ఇప్పటికే ముందస్తు బెయిలు మంజూరు చేసింది.

# ఇవాళ టెన్త్ ఫలితాలు



(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. ఫలితాలు విడుదలైన వెంటనే పదో తగరతి ఫలితాలను టీవీ9 వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.తెలంగాణలో పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగిన విషయం తెలిసిందే. పదో తరగతి పరీక్షలకు మొత్తం 7,39,493 మంది హాజరయ్యారు. ఇక ఇప్పటికే ఈ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయింది. ఫలితాల ప్రాసెసింగ్ కూడా ఇటీవలే ముగిసింది. దీంతో ఫలితాల విడుదలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.ఇదిలా ఉంటే గతేడాది తెలంగాణ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పెద్ద ఎత్తున ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఏకంగా 90 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. వీరిలో బాలుర ఉత్తీర్ణత శాతం 87.61 కాగా, బాలికల ఉత్తీర్ణత శాతం 92.45 గా ఉంది. జిల్లాల వారీగా చూస్తే సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో 97.87 శాతం ఉత్తీర్ణతతో తొలి స్థానంలో నిలిచింది. హైదరాబాద్ జిల్లా 79 శాతంతో చివరి స్థానంలో నిలిచిన విషయం విధితమే.

# చీకోటికి మరోసారి ఈడీ నోటీసులు

**హైదరాబాద్,:**

క్యాసినో కింగ్ చీకోటి ప్రవీణ్ కు ఈడీ మరోసారి నోటీసులు జారీ చేసింది. క్యాసినో కేసులో ఇప్పటికే చీకోటి ప్రవీణ్ ను విచారించిన ఈడీ.. తాజాగా థాయ్‌లాండ్‌లో జరిగిన ఘటన తర్వాత మరోసారి నోటీసులు జారీ చేసింది. చీకోటితో పాటు చిట్టి దేవేందర్, సంపత్, మాధవరెడ్డిలకు కూడా ఈడీ నోటీసులు పంపింది. ఇందులో సంపత్ ఇప్పటికే ఈడీ విచారణకు హాజరు కాగా మరో ముగ్గురు ఈడీ ఎదుట హాజరుకావాల్సి ఉంది. పట్టాయ కోర్టులో చీకోటి ప్రవీణ్ తో పాటు ఇతరులకు బెయిల్ వచ్చినప్పటికీ కొంత మంది ఇంకా ఇండియాకు చేరుకోలేదు.

థాయ్‌లాండ్ నుంచి మే12న చికోటి ప్రవీణ్ హైదరాబాద్ కు వస్తానని ఆయన సమాచారం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. థాయ్‌లాండ్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జూదం ఆడుతూ అక్కడి పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు ప్రవీణ్. నాలుగు రోజులు ఫోకర్న్ టోర్నమెంట్ అని చెబితే తాను థాయ్‌లాండ్ కు వెళ్లినట్లుగా తెలిపాడు. దేవ్ , సీత అనే ఇద్దరు తనకు ఆహ్వానం పంపారని, ఆ టోర్నమెంట్ లీగల్ అనే చెబితేనే తాను వెళ్ళినట్టిగా చీకోటి తెలిపాడు. . థాయ్‌లాండ్ లో గ్యాంబ్లింగ్ నిషేధం అనేది తనకు తెలియదని చీకోటి చెప్పాడు. తాను హాల్ లోకి వెళ్లిన 10 నిమిషాలకే రైడ్ జరిగిందని అన్నాడు. ఈ గ్యాంబ్లింగ్ తో సంబంధం లేదని తేలడంతో తాను చట్టపరంగా బయటకు వచ్చానని అన్నాడు. చీకోటి ప్రవీణ్ కు థాయ్‌లాండ్ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఆయనతోపాటు ఆరెస్ట్ అయిన 83 మంది భారతీయులకు కూడా థాయ్‌లాండ్ కోర్టు బెయిల్ ఇచ్చింది. 4500 బాట్స్ జరిమానాతో కోర్టు అందరికీ బెయిల్ ఇచ్చింది. జరిమానాను చెల్లించడంతో పోలీసులు వారికి పాస్ పోర్టులు కూడా ఇచ్చేశారు. గతంలో కూడా చీకోటి ప్రవీణ్ ను ఈడీ విచారించింది. విదేశాల్లో నిర్వహించిన క్యాసినో, ఈవెంట్స్ లావాదేవీలు, పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం దారి మళ్లించడం, బ్యాంకు ఖాతాల వివరాలు, వంటి అంశాలపై ప్రవీణ్ బృందాన్ని ఈడీ అధికారులు విచారించారు. చికోటి కస్టమర్లలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, జడ్పీ ఛైర్మన్లు ఇలా చాలా మంది ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నేపాల్, శ్రీలంక, ఇండోనేసియా, థాయ్ లాండ్.. తదితర దేశాల్లో క్యాసినో క్యాంపులకు వందల మంది పంటర్లను ప్రవీణ్ బృందం తరలించినట్లు ఈడీ గుర్తించింది. పట్టాయ అధికారులు , పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దాదాపుగా రూ. వంద కోట్ల వరకూ గ్యాంబ్లింగ్ నిర్వహించినట్లుగా అనుమానిస్తున్నారు. క్యాంపుల్లో జూదం ఆడేందుకు పంటర్లకు కావాల్సిన క్యాసినో టోకెన్లను సమకూర్చడం దగ్గరి నుంచి పంటర్లు గెలుచుకున్న సొమ్మును నగదు రూపంలో అప్పగించడం వరకు అంతా హవాలా మార్గంలోనే నడించిందనేది ఆ కేసులో ఈడీ ప్రధాన అభియోగం. అలాగే కమీషన్ల రూపంలో ప్రవీణ్ సంపాదించిన సొమ్మునూ ఈ మార్గంలోనే రప్పించుకొని ఆస్తులు కూడగట్టుకున్నట్లు ఈడీ అనుమానిస్తోంది. ఈ సారి మొత్తం గుట్టు ఈడీ బయట పెట్టే అవకాశం ఉంది.

# గంజాయికి అంతు లేదా

**విజయవాడ :**

వాడవాడలా విస్తరిస్తున్న గంజాయిపై ఇంత ఉదాసీనత ఎందుకని ఏపీ ప్రభుత్వాన్ని, రాష్ట్ర పోలీసులను చంద్రబాబు ప్రశ్నించారు. గంజాయికి అలవాటు పడిన వారి జీవితం ఎంత ప్రమాదంలోకి వెళ్తుందో అధికారులు అర్థం చేసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉదాసీనత వల్ల గంజాయి మహమ్మారి అమాయక యువత జీవితాలు బలి అవుతున్నాయన్న విషయాన్ని అదికారులు మర్చిపోవద్దని సూచించారు. పక్కా ప్రణాళికతో గంజాయి సరఫరాపై ఉక్కుపాదం మోపండని చంద్రబాబు సూచించారు.యువకుల మధ్య ఇయర్ బడ్స్ కోసం జరిగిన గొడవ.. చివరకు హత్యకు దారితీసిందని తెలుస్తోంది. యువకుడిని పలు ప్రాంతాల్లో తిప్పి తీవ్రంగా గాయపరచారు. చివరకు నగరంలోని జేడీ నగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చి, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడంటూ, వైద్యులను నమ్మించి ఆసుపత్రిలో చేర్పించి అక్కడ నుండి మిగిలిన మిత్రులు మాయం అయ్యారు. అయితే ఆ తరువాత కొద్దిసేపటికే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన జరిగిన తరువాత పోలీసులు కేసు దర్యాప్తు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శలు వస్తున్నాయి. ఈ ఘటనపై చివరకు కేసు నమోదు చేసుకున్నారు. పటమట, పెనమలూరు పోలీసుల మధ్య సరిహద్దు వివాదం తేలకపోవటంతో ఉన్నతాదికారులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. డీసీపీ సూచనల మేరకు చివరకు పోలీసులు కేసు నమెదు చేసుకున్నారు. అసలేం జరిగిందంటే..

పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కానూను శ్మశానం రోడ్డులోని శివారు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నాగార్జున, అజయ్ సాయి, ప్రశాంత్, మణి కంఠ మరో ఇద్దరు కలసి గంజాయి సేవించారు. గ్రూప్ లో ఒకరయిన అజయ్ సాయి ఇయర్ బడ్స్ తీసుకుని తిరిగి ఇవ్వలేదని గొడవ తలెత్తింది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో వీరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇదే సమయంలో మిగిలిన ఐదుగురు కలిసి అజయ్ సాయిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో అజయ్ సాయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వీరిలో నాగార్జున అనే యువకుడికి జేడీ నగర్ లో బంధువులు ఉన్నారు. అతని సలహా పేరు ప్రశాంత్ మణికంఠలు ద్విచక్ర వాహనంపై అజయ్ సాయిని జేడీ నగర్ సమీపంలోని పటమట డొంక రోడ్డులో ఉన్న ఆసుపత్రికి సోమవారం తెల్లవారు జామున తీసుకొచ్చారు. కండి పాడు వద్ద రోడ్డు ప్రమాదం జరిగిందని ఆసుపత్రి సిబ్బందికి చెప్పి, చికిత్స నిమిత్తం చేర్పించారు. మెడికో లీగల్ కేసు కావటంతో వైద్యులు కంకిపాడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం అజయ్ సాయి మరణించాడు. ప్రమాదం వల్ల జరిగిన గాయాలు కావని వైద్యు పోలీసులకు తెలిపారు. ఈ విషయాన్ని పెనమలూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కేసు వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

# నేడు కడియానికి పవన్ కళ్యాణ్ రాక

**కాకినాడ :**

అకాల వర్ష బాధిత రైతులను పరామర్శించేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా రంగంలోకి దిగుతున్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. కడియంలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పవన్ పరామర్శిస్తారు. తర్వాత కొత్తపేట మండలం ఆవిడిలో రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. పవన్ కల్యాణ్ ప్రస్తుతం ఒరిజినల్ గ్యాంగ్ స్టర్ ఓజీ సినిమా షూటింగ్‌లో ఉన్నారు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. అయితే అకాల వర్షాల కారణంగా తూ.గో, ప.గో రైతులు తీవ్రంగా నష్టపోయినప్పటికీ ప్రభుత్వం పెద్దగా స్పందించకపోవడంతో.. రైతులకు మద్దతుగా రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. చివరి క్షణంలో ఖరారైన పర్యటన అయినప్పటికీ జనసైనికులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కడియం మండలంలో జనసేన పార్టీ విజయం సాధించింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 16 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కాకినాడ, రాజమహేంద్రవరం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రస్తుతం 60 శాతం కోతలు పూర్తయ్యాయి. 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కేవలం మూడు లక్షలు మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసింది. మిగిలిన 4.50 లక్షల టన్నుల్లో 1.50 లక్షల టన్నులు ప్రయివేట్ వ్యాపారులు కొనుగోలు చేసినట్లు అంచనా. మిగతా ధాన్యం రైతుల కళ్లాల్లో, ఆరుబయట ఉంది. ఈ మధ్యలో అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయాయి. తడిచిన ధాన్యం



కొనుగోలుకు అధికారులు నిబంధనల పేరుతో జాప్యం చేస్తున్నారు. మొలక వచ్చిందని, రంగు మారిందని, తేమ శాతం అధికంగా ఉందని చెప్తుండడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కళ్లాల్లోనూ, ఆరుబయట ఉన్న ధాన్యాన్ని రక్షించుకోవడానికి ఒక్కో బరకాకు రోజుకు రూ.25 చొప్పున అద్దె చెల్లించాల్సి వస్తోంది.

# ప్రకాశంపై జగన్ ఫోకస్

## రంగంలోకి ఇంటలిజెన్స్...

**ఒంగోలు :**

ప్రకాశం జిల్లా రాజకీయాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ చాలా సీరియస్‌గా పరిశీలన చేస్తోంది. ఇప్పటికే నెల్లూరు ఎపిసోడ్ వైసీపీలో కలకలం రేపింది. నెల్లూరులా ప్రకాశం జిల్లా మారకుండా సీఎం జగన్ ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవలి రాజకీయ పరిణామాల దృష్ట్యా ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల మధ్య విభేధాల పై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారు. బాలినేని ఎపిసోడ్ లో చోటు చేసుకున్న పరిణామాలు పై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, పార్టీ వర్గాల నుండి ప్రత్యేకంగా సమాచారాన్ని తెప్పించుకుంటున్నారు. ఇంటలిజెన్స్ తో పాటు ఇతర నివేదికలను కూడా ముఖ్యమంత్రి తెప్పించుకుంటున్నారని చెబుతున్నారు. అత్యంత విశ్వసనీయ సమాచారం అవసరం కావడంతో సాక్షి మీడియాతో పాటు ఐ ప్యాక్ టీం, ఇతర మార్గాలు, సన్నిహితల నుండి కూడా పార్టీ వ్యవహారాలపై సీఎం సమాచారం తెలుసుకుంటున్నారు. పరిస్థితిని చక్కదిద్దాలని అనుకుంటున్నారు. ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నెల్లూరు ఎపిసోడ్ ఓ కుదుపు కుదిపింది. రాజకీయాల్లో సంచలనంగా మారింది. పార్టీపై జగన్ పట్టు జారిపోయిందన్న విశ్లేషణలు నెల్లూరులో పార్టీ ఎమ్మెల్యేల ధిక్కరణ ద్వారా వచ్చాయి. ముఖ్యంగా కోటంరెడ్డి తిరుగుబాటు విషయంలో అసలేం జరిగిందో అర్థం కాని పరిస్థితి వైసీపీలో ఉంది. చనిపోతే తన శవం పై కూడా జగనే జెండా కప్పాలంటూ కోటం రెడ్డి చెప్పేవారు. అలాంటి నేత పార్టీ నుంచి వెళ్లిపోయారు. అదే సమయంలో కోటం రెడ్డి బయటకు వెళ్లినప్పటి నుండి వైసీపీపై తీవ్ర స్థాయి పోరాటం చేస్తున్నారు. జగన్ సైతం కోటం రెడ్డి ఎపిసోడ్ పై ఆశ్చర్యానికి గురయ్యారు. పార్టీలో అంతర్గత గొడవల వల్లనే ఇలా జరుగుతోందని చివరికి గుర్తించారు. నెల్లూరు జిల్లాలో జరిగినట్లుగా ప్రకారం జిల్లాలో జరగకూడదని జనగ్ భావిస్తున్నా?. ప్రకాశం జిల్లా కూడా మరో నెల్లూరు జిల్లా కావొద్దు అని ముందు జాగ్రత్తలు తీసుకుంటునట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లాలో పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించారు. బాలినేని విషయంలో ఆయన డిమాండ్లు నెరవేరుస్తున్నారు. డీఎస్పీని మార్చేసి.. బాలినేని శ్రీనివాసరెడ్డి అడిగిన వారిని పెట్టారు. ఒకరి నియోజకవర్గాల్లో ఇంకొకరు జోక్యం చేసుకోకుండా చూసేలా ఒప్పందం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. బాలినేని కంట తడి పెట్టడం.. ఆయన అనుచరులు వైసీపీ జెండాలను పక్కన పడేయడం వైసీపీ హైకమాండ్ ను ఆందోళన గురిచేస్తోంది. రాజకీయంగా వేగంగా మారిపోతూండటంతో ప్రకాశం జిల్లా రాజకీయాల పై జగన్ స్వయంగా ఆరా తీయటంతో పాటుగా, జిల్లాలోని పరిస్దితులు,తెలుగు దేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతల కదలికల పై కూడా పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. అదే సమయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా సొంత పార్టీలోని నేతలు ఎవరయినా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారా అన్నదికూడా బయటకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను సహించే ధోరణిలో సీఎం లేరనే సందేశాన్ని - పంపేందుకు కూడ జగన్ వెనుకాడటం లేదు.ఇందుకు అవసరం అయిన అన్ని ఏజెన్సీలు సోషల్ మీడియాను క్షేత్ర పరిస్థితు లు పై నాయకుల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు. అందుకే ఎవరైనా టీడీపీతో టచ్ లో ఉంటే వెంటనే వారిని బహిష్కరిస్తారని చెబుతున్నారు.

బాలినేని వ్యవహారంలో పార్టీ అనుకూల మీడియా చాలా తెలివిగా వ్యవహరించింది. ఆయన నేరుగా పార్టీలోని నేతలు తనను ఇబ్బంది పెట్టారని కుండబద్దలు కొట్టారు. కానీ, వైసీపీ అనుకూల మీడియాతో మాత్రం ఆ పని ప్రతిపక్షనేతలెవరో చేసినట్టు కథనాలిచ్చారు. బాలినేని బాధపడ్డారన్నారే కానీ, ఆ బాధకు కారణం వైసీపీ నేతలే అనే విషయం మాత్రం దాచి ఉంచారు. అధిష్టానానికి ఆయన చేసిన సూచన కూడా హైలెట్ కాలేదు. ఒకరకంగా వైసీపీ దూరం పెట్టాలనుకుంటున్న నేతలెవరికీ సాక్షి సరైన కవరేజ్ ఇవ్వదు. ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా ఇతర నేతల విషయంలో కూడా ఇదే రుజువైంది. ఇప్పుడు బాలినేని వ్యవహారంలో కూడా అదే జరిగింది. ఆయన చెప్పిన అసలు విషయాన్ని మాత్రం హైలెట్ చేయలేదు. ఏదో మొహమాటానికి బాలినేని ఏడ్చారన్నట్టుగా వార్త ఇచ్చారు. అంటే పార్టీ దాదాపుగా బాలినేనిని పక్కనపెట్టడానికే డిసైడ్ అయిందనుకోవాలి. అసలు కప్పులో టీ లేదు, అందులో తుఫాన్ ఎక్కడిది అని ప్రశ్నించిన సజ్జల, బాలినేని ప్రెస్ మీట్లో బాధపడిన తర్వాత మాత్రం రియాక్ట్ కాలేదు. అంతా మీడియా ఊహాగానాలే అన్న పార్టీ ప్రధాన కార్యదర్శి బాలినేని విషయంలో ఏమని సమాధానం చెబుతారో చూడాలి. ఆయన్ను పక్కనపెట్టాలని భావిస్తే మాత్రం ఈ వ్యవహారంపై ఎవరూ నోరు తెరిచే సాహసం చేయరు. పార్టీ ఉద్దేశమేంటో తెలిసిన తర్వాతే నాయకులంతా ఒకరి తర్వాత ఒకరు రియాక్ట్ అవుతారు. ఈ రెండు రోజుల్లో దాదాపుగా పార్టీ నిర్ణయం ఏంటనేది తేలిపోతుంది. దాని ద్వారా బాలినేని భవిష్యత్తు కూడా తేలిపోతుంది. ఐదుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి.. ఇలాంటి నేత ఎవరైనా ఎంత స్ట్రాంగ్ గా ఉంటారు. కానీ బాలినేని ప్రెస్ మీట్ లో బేలగా మారిపోయారు. ఒకరకంగా ఆయన సింపతీకోసం ఎదురు చూస్తున్నారని తేలిపోయింది. కార్యకర్తలు, అభిమానులకోసం ఎందాకైనా పోరాడతానన్నారు. అంటే వారికోసమే తాను భవిష్యత్ నిర్ణయం తీసుకుంటానని ఇన్ డైరెక్ట్ గా హింట్ ఇచ్చారు. ప్రస్తుతానికి పుకార్లే అని బాలినేని స్వయంగా చెబుతున్నా, ఆయన టీడీపీ, జనసేనతో టచ్ లో ఉన్నారనే మాటలు బలంగా వినపడుతున్నాయి. ఒకవేళ ఆయన వైసీపీని కాదనుకుంటే, కచ్చితంగా ఆరెండు పార్టీల్లో ఏదో ఒకదానిని సెలక్ట్ చేసుకోవాల్సిందే. మరి బాలినేని ఎటువైపు వెళ్తారు, ఏ పార్టీ తీర్థం పుచ్చుకుంటారు. మరికొన్ని రోజుల్లో తేలిపోతుంది. బాలినేని వైసీపీని వీడితే అది కచ్చితంగా వైసీపీకి పెద్ద మైనస్ అనే చెప్పాలి. మిగతా నాయకులు వెళ్లిపోయినా జగన్ లైట్ తీసుకున్నారు, మరి బాలినేని వ్యవహారంలో ఆయన బుజ్జగింపులకు దిగుతారా లేక గతంలో జరిగిన మీటింగే ఫైనల్ అనుకోవాలా అనేది తేలాల్సి ఉంది.

# దేవాలయాల్లో ప్లాస్టిక్ బ్యాన్

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాల్లో ఇక నుంచి ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలకాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లతో పాటు ప్లాస్టిక్ కవర్లలో పూజా సామగ్రిని ఆలయాల్లోకి ఇకపై అనుమతించబోమని తేల్చి చెప్పింది. అలాగే ఆలయానికి అనుబంధంగా ఉండే దుకాణాల్లో సైతం ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల అమ్మకాలను నిషేధించనున్నారు. ప్రసాదాల పంపిణీలోనూ చిన్నచిన్న ప్లాస్టిక్ సంచుల వినియోగానికి పూర్తిగా చెక్ పెట్టాలని సంకల్పించింది. తొలి దశలో జూలై 1 నుంచి 6 (ఏ) కేటగిరీగా వర్గీకరించిన ప్రధాన ఆలయాలన్నింటిలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించనున్నారు. ఈ మేరకు ఈవోలకు దేవదాయ శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి రూ. 25 లక్షలు, ఆపైన ఆదాయం ఉండే ఆలయాలను దేవదాయ శాఖ 6 (ఏ) కేటగిరీగా వర్గీకరించింది. రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలో మొత్తం 24,699 ఆలయాలు, మఠాలు, సత్రాలు ఉండగా... ఇందులో 174 ఆలయాలు, 28 సత్రాలు, మఠాలు 6 (ఏ) కేటగిరీ కిందకు వస్తాయి. జూలై 1 నుంచి ఆయా ఆలయాలు, మఠాలు, సత్రాలలో ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించేందుకు తగిన చర్యలు చేపట్టాలని దేవదాయ శాఖ ఇప్పటికే ఆయా ఆలయాలు, సత్రాల ఈవోలకు ఆదేశాలు జారీ చేసింద. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గత కొద్ది నెలల నుంచి ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో అమలవుతున్న తరహాలోనే ప్రధాన దేవాలయాల్లో శుభ్రమైన మంచి నీటి సరఫరాకు చర్యలు చేపడతారు. అలాగే మంచి నీటి సరఫరా పాయింట్ల వద్ద స్టీల్ గ్లాస్‌లను అందుబాటులో ఉంచుతారు. భక్తులు ఇంటి నుంచి మంచినీరు తెచ్చుకున్నా గాజు సీసాలు లేదంటే స్టీల్ బాటిళ్లలో తెచ్చుకునేలా విస్తృత ప్రచారం చేయాలని అధికారులు భావిస్తున్నారు.

# రెంటికి చెడ్డ రేవడిలా వాసుపల్లి

**విశాఖపట్టణం.:**

వాసుపల్లి గణేష్.. పేరుకే తెలుగుదేశం ఎమ్మెల్యే.. కానీ చేసేది వైసీపీ భజన. తెలుగుదేశం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత తన కుమారులను వైసీపీలో చేర్చించారు. అక్కడితో ఆగకుండా వైసీపీ అధికార కార్యక్రమాలన్నీ ఈయన తన పర్యవేక్షణలోనే నిర్వహిస్తూ వచ్చారు. అంతేనా తాను గెలిచిన పార్టీ అధినేతపై విమర్శలు చేస్తూ జగన్ దృష్టిలో పడేందుకు శతధా ప్రయత్నాతు చేస్తూ వచ్చారు. విశాఖ సౌత్ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించిన వాసుపల్లి గణేష్ అధికార వైసీపీతో అంటకాగారు. అయితే ఎంత ప్రయత్నించినా ఆయనకు వైసీపీలో అవమానాలే తప్ప ఇసుమంత గౌరవం కూడా దక్కలేదు. ఇంత కాలం ఓపికగా ఎదురు చూసిన వాసుపల్లి గణేష్.. అక్కసంతా వెళ్లగక్కేశారు.ఇంత కాలం తనను అణగదొక్కింది వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి అని చెప్పకనే చెప్పేశారు. అంతే కాదు.. జగన్ మళ్లీ సీఎం కావాలంటే ఎంపీలు కాదనీ, గెలిచే ఎమ్మెల్యేలు కావాలని వైసీపీ అధినేతకు హితవు పలికారు. ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ గా విజయ సాయిని తప్పించిన తరువాత వాసుపల్లి గణేష్ గొంతు పెగల్చుకున్నారు. ఇంత కాలం తనకు సీఎంతో అప్పాయింట్ మెంట్ కూడా దొరక్కుండా చేసింది విజయసాయేనని కుండబద్దలు కొట్టారు. తనకు వ్యతిరేకంగా కార్పొరేటర్లను ఎగదోసి..పార్టీలో ఒంటరిని చేసిన విజయ సాయి లక్ష్యంగా మాటల తూటాలు పేల్చారు. కార్పొరేటర్లు, రాజ్యసభ సభ్యులు ఉన్నంత మాత్రాన సీఎం కాలేరని జగన్ ను ఒక లాంటి హెచ్చరిక చేశారు. గెలిచే సత్తా ఉన్న తనలాంటి వారిని దూరం చేసుకుంటే వచ్చే ఎన్నికల్లో నష్టం తప్పదని సుతిమెత్తటి వార్నింగ్ ఇచ్చారు.పైకి ఇందంతా విజయసాయిపై ఉన్న ఆగ్రహాన్ని వెళ్లగక్కినట్లు కనిపిస్తున్నా.. వైసీపీ మాత్రం ఆయనను నమ్మడం లేదు. వాసుపల్లి గణేష్ చూపు ఇప్పుడు తెలుగుదేశంపైకి మళ్లిందని అధికార పార్టీ వర్గాలు అంటున్నాయి. అటు తెలుగుదేశం పార్టీకి దూరమై..ఇటు నమ్మిన వైసీపీలో ఒంటరై వాసుపల్లి గణేష్ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిగా మారిందని పరిశీలకులు అంటున్నారు. ఏది ఏమైనా ఎమ్మెల్యేలు గెలిస్తేనే సీఎం అంటూ వాసుపల్లి గణేష్ చేసిన వ్యాఖ్యలు మాత్రం వైసీపీలో ప్రకంపనలు పుట్టిస్తున్నాయి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ తరువాత వైసీపీలో దాదాపు సీనియర్లంతా అలకపాన్పు ఎక్కి మౌనవ్రతం పట్టడంతో ఆ పార్టీలో అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా ఉంది. రేపు ఎన్నికల ముందు టికెట్ల పంపిణీ సమయంలో ఇది భగ్గుమనే అవకాశం మెండుగా ఉందని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వాసుపల్లి గణేష్ వ్యాఖ్యలు పార్టీలో వాస్తవ పరిస్థితికి అద్దం పట్టాయని అంటున్నారు.

# ఓల్డ్ స్ట్రాటజీ నే నమ్ముకున్న చంద్ర బాబు

**తిరుపతి:**

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కుప్పంలో ఈసారి లక్ష మెజారిటీతో రావాలని భావిస్తున్నారు. అందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తాను ఇన్నాళ్లు నమ్మిన నేతలను పక్కనపెట్టి కొత్త వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలను చంద్రబాబు అప్పగించారు. ఇది కుప్పం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. చంద్రబాబు ఎప్పుడూ లేనిది ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై కుప్పం తెలుగుదేశం పార్టీలో పెద్ద చర్చే జరుగుతుంది. చంద్రబాబు ఇన్నాళ్లు నమ్మిన నేతలు తనను ముంచేస్తారని చంద్రబాబు భయపడ్డారా? లేక కొత్త నాయకత్వానికి అప్పగిస్తేనే తప్ప గెలుపు తప్పదని చంద్రబాబు భావించే ఈ నిర్ణయం తీసుకున్నారంటారు మరికొందరు నేతలు. చంద్రబాబుకు కుప్ప నియోజవకర్గంలో ఎదురులేదు. 1989 నుంచి 2019 ఎన్నికల వరకూ వరస గెలుపులతో ఆయన కుప్పంలో తనకు ఎదురులేదని నిరూపించుకున్నారు. ఏడుసార్లు విజయం సాధించిన చంద్రబాబు ఈసారి కూడా గెలుపు కోసం భయపడాల్సిన అవసరం లేదు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలలో వచ్చిన ఫలితాలు చంద్రబాబును కొంత ఆలోచింప చేశాయని అంటున్నారు. గత ఎన్నికల్లోనే ఆయన మెజారిటీ ముప్ఫయివేలకు పడిపోయింది. ఇవన్నీ కొంత చంద్రబాబును ఇబ్బంది పెట్టాయంటున్నారు. రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు ప్రత్యర్థులు కుప్పం నియోజకవర్గాన్ని టార్గెట్ చేశారని భావిస్తున్నారు. తాను రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాల్సి రావడంతో కుప్పంలోనే తిష్ట వేసేందుకు వీలు లేదు. అలాగని మొన్నటి వరకూ తనకు అండగా ఉన్న నేతలను నమ్మే పరిస్థితి కూడా లేదు. ఎందుకంటే వారి ఉదాసీన వైఖరి కారణంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి పాలు కావాల్సి వచ్చిందన్నది చంద్రబాబు నమ్మకం. అందుకే తాజాగా కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను నియమించారు. కంచర్ల శ్రీకాంత్ ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నుంచి విజయం సాధించారు. వైసీపీకి పట్టున్న ప్రాంతాల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతోనే ఆయన గెలుపొందడంతో కంచర్ల శ్రీకాంత్ చంద్రబాబు దృష్టిలో పడ్డారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కంచర్ల శ్రీకాంత్ అనుసరించిన వ్యూహాలే ఆయనను గెలిపించాయని అందరూ నమ్ముతారు. ప్రత్యర్థి సామాజికవర్గంలోనూ, ఆర్థికంగానూ బలమైన నేత అయినప్పటికీ గెలిచాడంటే శ్రీకాంత్ సమర్థతను కొట్టిపారేయలేం అంటున్నారు టీడీపీ నేతలు. అందుకే ఏరి కోరి చంద్రబాబు కంచర్ల శ్రీకాంత్ కు కుప్పం నియోజకవర్గం బాధ్యతలను అప్పగించారంటున్నారు. వాహనాలు ఆగిపోయిన ఘటన భారత్ లో చోటు చేసుకోలేదు ఆయన స్ట్రాటజీలపై... కంచర్ల శ్రీకాంత్ స్ట్రాటజీలపై నమ్మకం ఉంచిన చంద్రబాబు పూర్తిగా ఆయనకు కుప్పం నియోజకవర్గ బాధ్యతలను అప్పగించారు. దీంతో పాటు సమన్వయ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్సీ గౌరవాని శ్రీనివాసులు, చంద్రబాబు పీఏ మనోహర్‌లో ఏదో నామమాత్రంగా నియమించారని కుప్పంలో అనుకుంటున్నారు. కుప్పంలో ఏ కార్యక్రమం చేపట్టాలన్నా కంచర్ల శ్రీకాంత్‌కు పూర్తి స్థాయి అధికారాలను అప్పగించారని చెబుతున్నారు. ఆయన చెప్పినట్లే నియోజవకర్గంలో నేతలు నడుచుకోవాలని కూడా చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ ద్వారా నేతలకు చెప్పినట్లు తెలిసింది. మొత్తం మీద తొలిసారి ఒక నేత రాజకీయ వ్యూహాలపై నమ్మకం పెట్టుకుని చంద్రబాబు కీలకస్థానం అప్పగించారని పార్టీలో చర్చ జరుగుతుంది.

# రైతు ఇంట సిరుల వర్షం

**వరంగల్ :**

తెల్ల బంగారం రైతుల ఇంట సిరుల వర్షం కురిపిస్తోంది. తాజాగా జమ్మికుంట మార్కెట్‌లో పత్తికి ఆల్‌టైం రికార్డ్ ధర లభించింది. అవును, మార్కెట్‌లో తెల్లబంగారం ధర పరుగులు పెడుతోంది. పత్తికి కేంద్ర ప్రభుత్వ కనీస మద్ధతు ధర క్వింటాలుకు 6,025 రూపాయల కన్నా రెండు రెట్లు ఎక్కువ పలుకుతుండటం గమనార్హం. తాజాగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర 13వేల రూపాయలు పలికింది. మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పత్తి ధరలు పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.గత సంవత్సరం ఎకరానికి 8 నుండి పది క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. అప్పుడు క్వింటాల్‌కు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు మాత్రమే ధర వచ్చింది. కనీసం పెట్టుబడి కూడా రాలేదు. కానీ, ఈ ఏడాది ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాల పత్తి దిగుబడి వచ్చింది. క్వింటాల్‌కు గరిష్టంగా 13 వేల రూపాయలు, మాడల్ ధర 10,200, కనిష్ట ధర 8,500 పలికింది. కేవలం జమ్మికుంటలోనే కాదు, ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ధర పలికుతోంది. అటు ఏపీలోనూ పత్తికి ఆల్ టైం రికార్డ్ ధరలు వస్తున్నాయి. ఈ ఏడాది పత్తిసాగు తగ్గడం, దిగుబడి తగ్గడంతో పత్తికి డిమాండ్ పేరుగుతోందని అంటున్నారు వ్యాపారులు. అటు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో పత్తికి విపరీతంగా డిమాండ్ ఉంది. దీంతో పత్తి పండించే రాష్ట్రాల్లో అధిక ధరలు పెట్టి కొంటున్నారు వ్యాపారులు. అయితే, పెరిగిన ధరలు కొంత ఊరట ఇస్తున్నా, ఈఏడాది వాతావరణ మార్పులతో పత్తి దిగుబడి తగ్గిందని చెబుతున్నారు రైతులు.

# ఎంపీలు ఎమ్మెల్యేలకు ఎంట్రీ లేదా

**హైదరాబాద్ :**

బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే రాజాసింగ్ కు తెలంగాణ నూతన సచివాలయం వద్ద ఘోర అవమానం ఎదురైంది. ఓ సమావేశం కోసం సచివాలయానికి వచ్చిన రాజాసింగ్ ను సెక్యూరిటీ సిబ్బంది గేటు వద్దే నిలిపివేశారు. లోపలికి అనుమతిలేదని తేల్చిచెప్పారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆహ్వానం మేరకు మీటింగ్ వచ్చానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పినా భద్రతా సిబ్బంది పట్టించుకోలేదు. అయితే ఈ పరిణామాలపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ఏర్పాటు చేశామని, నగరంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలందరినీ ఆహ్వానించామని మంత్రి తలసాని చెప్పారు. దీంతో బుల్లెట్ పై సచివాలయానికి వచ్చిన రాజాసింగ్ ను పోలీసులు గేటు వద్దే అడ్డుకున్నారు. సచివాలయం లోపలికి అనుమతి లేదని చెప్పడంతో రాజాసింగ్ చాలాసేపు గేటు వద్దే వేచిఉండి వెనుదిరిగారు.ఘటనపై ఎమ్మెల్యే రాజాసింగ్ సీరియస్ అయ్యారు. పోలీసులు తనను సచివాలయంలోపలికి అనుమతించకపోవడం బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పేషీ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు సమావేశానికి వచ్చానన్నారు. అయితే పోలీసులు తనను అడ్డుకుని అవమానకరంగా ప్రవర్తించారని రాజాసింగ్ ఆరోపించారు. టైంపాస్ కోసం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమావేశం పెట్టారా? అని ప్రశ్నించారు. సచివాలయంలోకి ఎమ్మెల్యేలు, ఎంఎలను అనుమతించకపోతే ఇంకెవరిని అనుమతిస్తారని తీవ్రంగా మండిపడ్డారు. ప్రజల సొమ్ముతో కట్టిన సెక్రటేరియట్ లోకి ప్రజా ప్రతినిధులను అనుమతించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను అడ్డుకోవాలని పోలీ సులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారో చెప్పాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు.అయితే ఈ ఘటనపై మంత్రి పేషీ మరోలా సమాధానం ఇస్తుంది. రాజాసింగ్ కు ఆహ్వానం పంపామని, ఆయన సమావేశానికి రాలేదని పేర్కొంది. గేటు వద్ద జరిగిన విషయంపై తమకు సమచారంలేదని తెలిపింది.ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని కూడా నూతన సచివాలయంలోకి పోలీసులు అనుమతించలేదు. ఓఆర్ఆర్ టోల్ విషయంలో స్కామ్ జరిగిందని ఆరోపించిన రేవంత్ రెడ్డి... ఆ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సెక్రటేరియట్ కు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ విషయం గ్రహించిన పోలీసులు రేవంత్ రెడ్డిని టెలిఫోన్ భవన్ వద్ద అడ్డగించారు. సచివాలయం గేటు వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సచివాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి తనకు ఆహ్వానం లేదని గవర్నర్ తమిళి సై కూడా ఇటీవల విమర్శలు చేశారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన సచివాలయంలోకి ప్రజాప్రతినిధులను అనుమతించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఎమ్మెల్యేలు, ఎంపీలకే అనుమతి లేకపోతే సమస్యలు చెప్పుకోడానికి వచ్చే సామాన్య ప్రజల సంగతేంటని ప్రశ్నిస్తున్నారు.

# జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ తో సి.ఎస్ , డీజీపీ భేటీ

**హైదరాబాద్**

జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అహిర్ ను మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఒకరోజు పర్యటనకు హైదరాబాద్ కు వచ్చిన హన్సరాజ్ గంగారామ్ ను హరితా ప్లాజా లో కలసి తెలంగాణా రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు అమలవుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను సి.ఎస్ శాంతా కుమారి వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఓబీసీలకు రిజర్వేషన్లు, రిజర్వేషన్ రోస్టర్ అమలుపై బీసీ కమిషన్ చైర్మన్ కు సి.ఎస్, వివరించారు. వీరితోపాటు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ సలహాదారు రాజేష్ కుమార్ కూడా వచ్చారు. అనంతరం మెదక్లోని జీఎం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీఎండీ భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్), హైదరాబాద్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, యూనివర్సిటీ ఆఫ్ ఉస్మానియా, డీడీ న్యూస్ రీజినల్ హెడ్తో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ భేటీ అవుతున్నారు.

# నగ్నకళ్లజోళ్లంటూ మోసం

**హైదరాబాద్ :**

సమాజంలో ఈజీ మనీకి అలవాటు పడ్డ వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. ప్రస్తుతం భౌతికంగా దాడులు చేసి దోచుకునే రోజులు పోయాయి మోసం చేసి డబ్బులు కాజేసే కేటుగేళ్లు చెలరేగి పోతున్నారు. ప్రజల అత్యాశనే పెట్టుబడిగా చేసుకుంటూ లక్షలు కాజేస్తున్నారు. తాజాగా ఇలాంటి ఓ మోసమే చెన్నై నగరంలో వెలుగులోకి వచ్చింది. చెన్నైలోని కోయంబేడులో జరిగిన ఈ సంఘటనలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.పోలీసుల సమాచారం ప్రకారం.. కొయంబేడులో నలుగురు యువకులు ఒక ముఠాలో ఏర్పడి యువతను టార్గెట్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. నగ్నంగా కనిపించే కూలింగ్ గ్లాస్‌ల పేరుతో భారీగా దోచుకున్నారు. ఈ గ్లాసెస్ పెట్టుకుంటే ఎదుటి వ్యక్తులు నగ్నంగా కనిపిస్తారని నమ్మించి ఒక్కో గ్లాస్‌ను రూ. లక్షల్లో అమ్మేశారు. ధనవంతుల కుటుంబాలకు చెందిన యువతను టార్గెట్ చేసుకొని ఈ మోసానికి పాల్పడ్డారు. కోయంబేడులో అనుమానస్పదంగా కనిపించిన ఓ కేరళ ముఠాకు చెందిన నలుగుర యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.పట్టుబడ్డ వారు బెంగళూరుకు చెందిన శివ, కేరళకు చెందిన కుబైట్, జిత్తు, ఇర్షాద్‌లుగా పోలీసులు గుర్తించారు. వీరిలో పాటు కూలింగ్ గ్లాసెస్, తపపాకీ, బుల్లెట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారిస్తున్నారు. ఇక ఇలాంటి అబద్ధపు ప్రచారాలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు పోలీసులు సూచించారు.

# వ్యాఖ్యలపై సోనియాను వివరణ కోరిన ఈసి

**న్యూఢిల్లీ :**




కర్ణాటక ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ చేసిన కర్ణాటక సార్వభౌమాధికారంవ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ ఫిర్యాదు మేరకు కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఈ విషయంలో వివరణ ఇవ్వాలంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని కోరింది.అంతకు ముందు సోనియాగాంధీ తన ప్రసంగంలో 'సార్వభౌమాధికారం' అనే పదాన్ని ఉపయోగించడంపై అభ్యంతరం తెలిపిన బీజేపీ ఎంపీలు... ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఈసీఐని బీజేపీ ప్రతినిధి బృందం కోరింది.కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కర్ణాటక ప్రతిష్ట, సార్వభౌమాధికారం, సమగ్రతకు ముప్పుగా పరిణమించే ఎవరినీ కాంగ్రెస్ పార్టీ ఉపేక్షించదని కాంగ్రెస్ పార్టీ మే 6న ఒక ట్వీట్ చేసింది. ఈ వ్యాఖ్యలపై బీజేపీతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. సోనియాగాంధీ 'సార్వభౌమాధికారం' అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగానే వాడినట్టు కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ విమర్శించారు. ఆమెపై ఈసీ చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ శోభా కరంద్లాజే సైతం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. సార్వభౌమాధికారం పదాన్ని దేశానికి మాత్రమే ఉపయోగిస్తారని, సోనియాగాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# మే 31 న మున్నూరు కాపుసత్రం భూమి పూజ

**హైదరాబాద్**



ఈ నెల 31 న కొమురవెల్లి లో మున్నూరు కాపుసత్రం భూమి పూజ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటు శ్రీ మల్లికార్జున స్వామి మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్ర భవనం వ్యవస్థాపక అద్యక్షులు ఉప్పు రవీందర్ పటేల్ తెలిపారు.ఈ మేరకు హైదరాబాద్లోని బిసి భవన్ లో మున్నూరు కాపుసత్రం భూమి పూజ వాల్ పోస్టర్ ను రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య,ఎర్ర సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరిం చారు. అనంతరం ఈ మహా కార్యానికి రావసిన్దిగా ఆర్ కృష్ణయ్య ఆహ్వానించారు అనంతరం ఉప్పు రవీందర్ పటేల్ మాట్లాడుతూ కాశీ పీఠం పీఠాతీస్వర్లు పరమహంస పరి వజ్రకాచార్య శ్రీ శ్రీ శ్రీ శివ నాగేంద్ర సరస్వతి స్వామీజీ మహాస్వామిజీ చేతుల మీదుగా ఈ భూమి పూజా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు కుల బంధువులను ప్రతి ఒక్కరిని కలిసి ఆహ్వానించడం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆకుల.రాజయ్య పటేల్, మొగిలి దుర్గ ప్రసాద్ పటేల్, గూడెపు ప్రవీణ్ పటేల్, ఎడ్ల సురేందర్ పటేల్, మారిశెట్టి మురళి పటేల్,స్వామి వివేక్ పటేల్ కాముని రమేష్ పటేల్, మురళి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# జేపీఎస్ లకు అండగా నిలవండి

**వారి ఇండ్ల వద్దకెళ్లి సంఘీభావం తెలపండి**

**జిల్లా అధ్యక్షులు, ఇంఛార్జీలు, అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లతో బండి సంజయ్ టెలికాన్ఫ్ రెన్స్**

**హైదరాబాద్**



న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు(జేపీఎస్) రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులన్నీ అండగా నిలవాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. అందులో భాగంగా సమ్మె చేస్తున్న జేపీఎస్, ఓపీఎస్ ల ఇండ్ల వద్దకు, సమ్మె చేస్తున్న ప్రాంతాలకు వెళ్లి పూర్తిస్థాయిలో సంఘీభావం తెలపాలని కోరారు. అంతేగాకుండా జేపీఎస్ ల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పక్షాన క్షేత్ర స్థాయిలో ఎక్కడికక్కడ వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వారి సమ్మెకు మద్దతు ఇతర శాఖల ఉద్యోగులను భాగస్వాములను చేసి జేపీఎస్ లు ఒంటరి కాదనే సంకేతాలను పంపాలని కోరారు. మంగళవారం ఉదయం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఇంఛార్జీలు, అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లతో బండి సంజయ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి హాజరైన ఈ టెలికాన్ఫరెన్స్ లో బండి సంజయ్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సంఘీభావం తెలిపే అంశంతోపాటు ఈనెల 11న సంగారెడ్డిలో నిర్వహించే "నిరుద్యోగ మార్చ్", 14న కరీంనగర్ లో నిర్వహించే "హిందూ ఏక్తా యాత్ర" అంశాలపైనా దిశానిర్దేశం చేశారు అట్లాగే టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, బాధ్యుడైన ఐటీశాఖ మంత్రిని కేబినెట్ నుండి తొలగించాలని, పరీక్షల రద్దుతో నష్టపోయిన నిరుద్యోగులందరికీ రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలనే ప్రధాన డిమాండ్లో ఈనెల 11న సంగారెడ్డిలో నిర్వహించబోయే "నిరుద్యోగ మార్చ్"లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

# దుబ్బాకలో మారుతున్న లెక్కలు

**మెదక్ :**

చ్చే ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి అధికార పార్టీ తరపున పోటీలో నిలిచేదేవరనే అంశం ఇప్పుడు రాజకీయంగా ఆసక్తిగా మారింది. ప్రస్తుతం ఎంపీగా ఉన్న కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. ఇటీవల జరిగిన పార్టీ ప్లీనరీలో స్వయంగా సీఎం కేసీఆరే ప్రభాకర్ రెడ్డికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మెదక్ స్థానాన్ని ఎవరితో భర్తీ చేయనున్నారనేది ఆసక్తి నెలకొన్నది. ఎమ్మెల్యే రఘునందన్ రావును దుబ్బాకలో ఓడించడమే లక్ష్యంగా కొత్త ప్రభాకర్ రెడ్డిని బరిలో దింపినట్లు పార్టీలో చర్చ జరుగుతున్నది. మెదక్ పార్లమెంట్ పరిధిలో మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, మెదక్, గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. పెద్ద నియోజకవర్గం, ప్రతిపక్ష పార్టీల నుంచి కూడా బలమైన లీడర్లు ఉన్న నేపథ్యంలో అధికార పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థి కూడా బలమైన నేతనే బరిలో దింపాల్సి ఉంటుంది. కాగా సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు.జరగబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ గజ్వేల్ స్థానం నుంచి పోటీ చేస్తారా..? మరో చోటకు వెళతారా..? అనే అంశంపై క్లారిటీ రావాల్సి ఉన్నది. మెదక్ ఎంపీ అభ్యర్థి వ్యవహారం గజ్వేల్‌తో ముడిపడి ఉన్నదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతాప్ రెడ్డిని గజ్వేల్ నుంచి గెలిపించాలని తన వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఓ సమీక్షలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో గతంలో సీఎం అన్న విషయం తెలిసిందే. అయితే సీఎం ఇంకా అదే మాటమీద ఉన్నారా..? మనసు మార్చుకున్నారా..? తెలాల్సి ఉన్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ బలంగానే ఉన్నదని, పార్టీ వీక్‌గా ఉన్న జిల్లాలో ఏదో ఓ చోట నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేసే అవకాశాలు లేకపోలేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే సీఎం గజ్వేల్‌ను వీడితే ఇక్కడ వంటేరు ప్రతాప్ రెడ్డికి అవకాశం ఇవ్వనున్నారు. సీఎం ఇక్కడే ఉంటే మాత్రం ప్రతాప్ రెడ్డిని మెదక్ ఎంపీ బరిలో దింపనున్నట్లు కూడా పార్టీలో చర్చలు జరుగుతున్నాయి. ప్రతాప్ రెడ్డి గజ్వేల్ అసెంబ్లీ బరిలో ఉండి, సీఎం మరో సెగ్మెంట్‌కు వెళితే మాత్రం మరొకరిని మెదక్ ఎంపీ బరిలో దింపనున్నారు. అలా నిలిచేదెవరో వేచి చూడాల్సి ఉన్నది.మెదక్ ఎంపీ దుబ్బాక అసెంబ్లీ నుంచి పోటీ చేయనున్న నేపథ్యంలో ఇక్కడ పోటీ రసవత్తరంగా మారనున్నది. గత ఎన్నికల్లో ఇక్కడ బీఆర్ఎస్ నుంచి స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సుజాత పోటీ చేసి బీజేపీ నేత రఘునందన్ రావుపై ఓటమి చెందిన విషయం తెలిసిందే. సెంటిమెంట్ కూడా ఇక్కడ పనిచేయలేదనే చెప్పుకోవచ్చు. ఈ సారి రఘునందన్ రావును ఎట్టి పరిస్థితుల్లో ఓడించాలని కొత్త ప్రభాకర్ రెడ్డిని సీఎం కేసీఆర్ బరిలో దింపినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నుంచి కొత్త ప్రభాకర్ రెడ్డి, బీజేపీ నుంచి రఘునందన్ రావు, కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి కొడుకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి దుబ్బాక నుంచి పోటీ చేయనున్న నేపథ్యంలో ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే గెలుపే లక్ష్యంగా కొత్త ప్రభాకర్ రెడ్డి ఇక్కడే మకాం వేసి అభివృద్ధికి నిధులు కేటాయించుకోవడంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు.

# నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం

**కరీంనగర్ :**

సరిగ్గా ఎనిమిది నెలల క్రితం రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు వరద ప్రవాహంతో భయోత్పాతాన్ని సృష్టించాయి. ఈ వరదల కారణంగా ఉమ్మడి జిల్లాలోని ఉప నదులపై నిర్మించిన చెక్ డ్యాంలు కూడా కొట్టుకపోయాయి. కొన్ని నిర్మాణ దశలో కొట్టుకపోగా, నిర్మాణం పూర్తయిన చెక్ డ్యాంలూ అధ్వానం అయ్యాయి. వరద బీభత్సానికి నాశనమైన వీటిని పునరుద్ధరించడంలో మాత్రం ఇరిగేషన్ అధికారులు చూపిస్తున్న శ్రద్ధకు సజీవ సాక్ష్యంగా నిలిచిపోయాయని చెప్పవచ్చు. జలవనరులను పునరుద్ధరించడంతోపాటు భూగర్భ జలాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న సంగతి తెలిసిందే. సీఎం కేసీఆర్ నీటి పారుదల శాఖపై ఎక్కువ మక్కువ చూపిస్తుంటారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి కనుసన్నల్లో పనులు చేస్తున్నామన్న విషయాన్ని విస్మరించి మరీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు దారి తీస్తోంది. అంచనాలు తయారు చేసేప్పుడు జరిగిన తప్పిదాలో లేక నిర్మాణంలో జరిగిన లోపాలో, అంచనాలకు మించి వచ్చిన వరద బీభత్సం కారణామో కానీ చెక్ డ్యాంలు మాత్రం ఎక్కడికక్కడా కొట్టుకపోయాయి. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో కూడా ఇదే సమయంలో రూ. 18 కోట్లతో ఆరు చెక్ డ్యాంలను నిర్మించారు. రామడుగు, కొక్కెరకుంట, మోతె, గోలి రామయ్యపల్లి, వన్నారం, షా నగర్ ల మీదుగా ప్రవహిస్తున్న మోతె వాగుపై ఆరు చెక్ డ్యాంలను నిర్మించారు. ఇందులో మోతె, వన్నారం సమీపంలోని చెక్ డ్యాంలు డ్యామేజ్ అయ్యాయి. మోతె చెక్ డ్యాంకు మరమ్మత్తులు చేసినప్పటికీ వన్నారం గురించి పట్టించుకునే నాథులే కరువయ్యారు.దాదాపు 8 నెలల క్రితం వరద బీభత్సం సృష్టించిన ప్రళయం కారణంగా అస్థిత్వం కోల్పోయిన ఈ చెక్ డ్యాం నిర్మాణం గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్ పై ఒత్తిళ్లు తీసుకరావడం లేదో లేక వారిపైనే ఒత్తిళ్లు వస్తున్నాయో తెలియదు కాని వన్నారం చెక్ డ్యాం మరమ్మత్తుల ఊసే ఎత్తడం లేదు. ఇరిగేషన్ ఇంజనీర్లు మాత్రం రిపేర్లు చేస్తున్నామని చెప్తున్నారు కానీ వాస్తవంగా మాత్రం ఇక్కడ ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. వన్నారం చెక్ డ్యాం వద్ద అప్రాన్, కట్ ఆఫ్ వాల్ కొట్టుకుపోయాయి. దీంతో చెక్ డ్యాం మళ్లీ మొదటి నుండి నిర్మించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అయితే ఇప్పటికీ ఇక్కడ చెక్ డ్యాం శిథిలాలు దర్శనమిస్తున్నాయి తప్ప పనులు మాత్రం ప్రారంభం కాలేదు.ఈ పనులు సీమాంధ్రకు చెందిన కాంట్రాక్టర్ టెండర్ ద్వారా దక్కించుకోగా వీటిని సబ్ కాంట్రాక్ట్ కు అప్పగించినట్టుగా తెలుస్తోంది. స్థానికంగా ఉన్న సబ్ కాంట్రాక్టర్ ఈ పనులు చేపట్టినట్టు సమాచారం. సీమాంధ్రకు చెందిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదన్న కారణంతో ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా తెలియడం లేదు. వెంటనే పనులు పూర్తి చేయాలని నోటీసులు అందించడంతోపాటు షోకాజ్ ఇచ్చి బ్లాక్ లిస్టులో పెడ్తామన్న హెచ్చరికలు కూడా చేసే అవకాశం ఇరిగేషన్ అధికారులకు ఉంటుంది. కానీ ఇలాంటి చర్యలు ఏవీ తీసుకోకపోవడం వల్లే ఈ చెక్ డ్యాం పునరుద్ధరణ పనులు నేటికీ ప్రారంభం కాలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.వేసవి కాలం తరువాత వచ్చేది వర్షాకాలమేనన్న విషయాన్ని అధికారులు పట్టించుకోనట్టుగా అర్థం అవుతోంది. వర్షాకాలం ప్రారంభం అయితే మళ్లీ వరదలు వస్తే సమీప గ్రామాలు మునకకు గురయ్యే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే వన్నరం చెక్ డ్యాంను పునరుద్ధరించినట్టయితే దాని సామర్థ్యంతోపాటు సాంకేతిక పరమైన సమస్యలను ఇంజనీర్లు టెక్నికల్ గా పరీక్షించే అవకాశం ఉండేది. ఇప్పుడు పనులు ప్రారంభించినా చెక్ డ్యాం పూర్తయ్యే నాటికి వర్షాలు మొదలైతే మళ్లీ మొదటికొచ్చే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇరిగేషన్ అధికారులు ఎలా ముందుకు సాగుతారో అంతుచిక్కకుండా పోయింది.

# మోసపు రిజిస్ట్రేషన్ పై నానమ్మ ఫిర్యాదు

**మనుమడిపై కేసుకు ,రిజిస్ట్రేషన్ బ్లాక్ కు ఆర్డీవో ఆదేశాలు**

**సరిగా విచారణ చేయని తహాశీల్దార్ పై చర్యలు**

**జగిత్యాల ఆర్డీవో మాధురి**

**జగిత్యాల**



వయోవృద్ధులైన తల్లిదండ్రులను కొందరు కన్న కొడుకుల తో పాటు మనుమలు సైతం మోసగిస్తూ తమ పేరిట వారి ఆస్తులను మోసం తో రిజిస్ట్రేషన్ చేసుకున్న సంఘటనలు జరుగుతున్నాయి.అందుకు జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో ట్రిబ్యునల్ చైర్మన్ ఆర్.డి.మాధురి కి కొడిమ్యాల మండలం రామ్ సాగర్ గ్రామానికి చెందిన నీలగిరి అమ్మాయి(86) అనే వృద్ధురాలు తన మనుమడు నీలగిరి రామేశ్వర్ రావు తన పేరిట గల పట్టా భూమిని మోసగించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ,అట్టి భూమిని తిరిగి నా పేరిట పట్టా చేయించాలని,మోసగించిన మనుమడిపై,ఎలాంటి విచారణ చేయకుండా రిజిస్ట్రేషన్ చేసిన కొడిమ్యాల తహాశీల్దార్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం ఫిర్యాదు చేసింది..ఆ వృద్ధురాలు విలేకరులకు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. కొడిమ్యాల మండలం రామ్ సాగర్ గ్రామానికి చెందిన నీలగిరి అమ్మాయి అనే 86 సంవత్సరాల వృద్ధురాలి భర్త 4 ఏళ్ల క్రితం మరణించాడు.ఆమెకు ఇద్దరు కుమారులుండగా వారిలో చిన్న కొడుకు గతం లోనే పాముకాటు ప్రమాదంలో మరణించగా,ఉన్న పెద్ద కొడుకు,ఆమెను పోషించక పోవడం తో ఆ వృద్ధురాలు పలు ఇబ్బందులు పడుతూ జీవిస్తున్న పరిస్థితులో నీకు రైతు బంధు కోసం తహాశీల్దార్ అఫిసు లో సంతకం పెట్టాలని ఆమె మనుమడైన నీలగిరి రామేశ్వర్ రావు మోసగించి తనకు నానమ్మ తన పట్టా భూమి 2 ఎకరాలు అమ్మిందని తహాశీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ,ఆ సమయంలో తనను తహాశీల్దార్ నీవు భూమి అమ్మినావా,డబ్బులు ముట్టాయా అని అడుగలేదని, అడిగి ఉంటే ఆ మోసం తెలిసేదని ఆ వృద్ధురాలు రోదిస్తూ ఆర్డీవో కు ఫిర్యాదు చేసింది.వెంటనే స్పందించిన ఆర్డీవో ఆ భూమి రిజిస్ట్రేషన్ ను బ్లాక్ చేయాలని, .అంతే కాక మోసం చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న మనుమడిపై పోలీసు కేసు పెట్టాలని తహాశీల్దార్ ను ఆర్డీవో ఆదేశించారు.. ఎలాంటి విచారణ చేయకుండా రిజిస్ట్రేషన్ చేసిన తహాశీల్దార్ పై శాఖపర చర్యలు తీసుకుంటామని ఆర్డీవో అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ వయోవృద్ధులకు చట్టపరమైన రక్షణలున్నప్పటికీ కుమారులు, కూతుర్లు,



మనుమలు ,వారసులు నిరాదరిస్తు,మోసం తో నమ్మించి వారి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడం, వంతుల పోషణ పేరుతో యమ పాషాలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.సిద్దిపేట జిల్లాలో వృద్ధుడు తనకు తానే చితి పేర్చుకొని సజీవ దహనం,కామారెడ్డిలో తల్లి శవాన్ని హాస్పిటల్ నుంచి తీసుకు పోని కర్కశ కూతుర్ల సంఘటనలు హృదయ విధారకమన్నారు.నిరాదరిస్తున్న వారికి 3 నెలల జైలు శిక్ష చాలదని,దీన్ని ఒక సంవత్సరం పెంచాలని,వయోవృద్ధుల సంరక్షణ చట్టంలో ఇంకా పలు ప్రయోజన సవరణలు తమ రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహారావు సూచించినట్లుగా కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం,సాధికారత శాఖ ఏండ్లు గడుస్తున్నా అమలు చేయక పోవడం పై ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో .రాజ్ మనోహర్ రెడ్డి, సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు బొల్లం విజయ్,ఎం.డి.యాకూబ్,వి.ప్రకాష్ రావు, పి.ఆశోక్ రావు, బి.కరుణ,బెజ్జ0కి లక్ష్మణ్,ఫిర్యాదు దారులు ,సీనియర్ సిటీజేన్స్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ దందా కొత్త పుంతలు

**హైదరాబాద్ :**

గంజాయి స్మగ్లర్లు కొత్తకొత్త రూట్లలో ట్రాన్స్ పోర్ట్ చేస్తున్నారు. కొత్త తరహాలో కొత్త రూట్ లో పుష్పకు మించిన తెలివితేటలతో గంజాయిని సిటీలకు చేరవేస్తున్నారు గంజాయి స్మగ్లర్లు తెలివితేటలు చూసి పోలీసులు అవాక్కవుతున్నారు. తాజాగా హైదరాబాద్ నగరంలో 70 కిలోల గంజాయిని వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి నేరుగా హైదరాబాద్ గల్లిలోకి చేరవేస్తున్నారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి రోడ్డు మార్గం ద్వారా స్మగ్లింగ్ జరుగుతోందని పోలీసులు భావించారు. ఈ గంజాయిని ట్రాన్స్ పోర్ట్ చేస్తున్న ఐదుగురు మహిళలని తేలడంతో పోలీసులు సైతం విస్తుపోయారు. కానీ కొత్త తరహాలో కొత్త పంథాలో గంజాయిని ఏజెన్సీ నుంచి నేరుగా హైదరాబాద్ గల్లి గల్లి లోకి చేరుకుంటుంది. దీనిని గుర్తించిన హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గ్యాంగ్ ను నేరుగా పట్టుకోవడం జరిగింది.గంజాయి రవాణా కోసం మహిళల్ని వాడుకున్న తీరు పోలీసులు సైతం అవాక్కయ్యారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి ఐదుగురు మహిళలు తమ బ్యాగ్ లతో బయలుదేరుతారు. బస్సుల ద్వారా వైజాగ్ కి చేరుకుంటారు. అక్కడ ఏసి కోచ్ లలో అప్పటికే తమ కోసం రిజర్వు చేసిన సీట్స్ ఐదుగురు మహిళలు కూర్చుంటారు. వీరితో పాటు తెచ్చిన బ్యాగులను ఒక్కొక్క చోట పెట్టి హాయిగా నిద్ర పోతారు. ఉదయానికి ట్రైన్ నేరుగా హైదరాబాద్ చేరుకుంటుంది. తాము పెట్టిన బ్యాగులను తీసుకొని నేరుగా హైదరాబాదులోని గంజాయి స్మగ్లర్ వద్దకు మహిళలు చేరుకుంటారు. తమ వెంట తెచ్చిన బ్యాగులను వాళ్ళకి అప్పగిస్తారు.. ఈ బ్యాగ్ లలు గంజాయి ఉంటుంది.. అయితే అది కూడా ఎవరికీ అనుమానం రాకుండా ఉంటుంది.. ఒక్కొక్క బ్యాగ్ లో ఐదు కిలోల చొప్పున గంజాయి ప్యాక్ చేసి తీసుకు వస్తారు. బట్టలు బ్యాగ్ అడుగు ప్రత్యేకమైన సొరగు ఏర్పాటు చేసుకుని అందులో గంజాయి పెట్టుకొని వీళ్లు హైదరాబాద్ వరకు తీసుకు వస్తున్నారు .ఇప్పటి వరకు కొన్ని వందల పైచిలుకు గంజాయి నీ ఐదుగురు మహిళలు హైదరాబాద్‌కు తీసుకొని వచ్చారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఐదుగురు మహిళలు అరెస్టు చేయడంతో అసలు విషయం బట్టబయలైందని తెలిపారు. ఈ గ్యాంగ్ వెనకాల రమేష్ అనే గంజాయి స్మగ్లర్ ఉన్నాడని పోలీసుల విచారణలో బయట పడింది. రమేష్ ని పట్టుకోడానికి వెళ్తే డ్రగ్స్ సరఫరా చేసే ముఠా బయటపడింది. ముంబై కేంద్రంగా డ్రగ్స్ దందా చేస్తున్న ఖాద్రి, సయీద్ ప్రధాన సూత్రధారని తేలింది. ఈ ఇద్దరు కలిసి ముంబై నుంచి బ్రౌన్ షుగర్ ని హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్, ఢిల్లీ, ముంబై చెన్నై లాంటి పట్టణాలకు డ్రగ్స్ చేరవేస్తూ ఉన్నట్లుగా బయటపడింది.. ఈ ఇద్దరి వెనకాల డ్రగ్స్ ప్రధాన సూత్రధారి మరొకరు ఉన్నట్టుగా పోలీసుల విచారణలో వెలుగుచూసింది. మహేష్ అనే డ్రగ్ కింగ్ పిన్ ఈ వ్యవహారం మొత్తం వెనకాల ఉండి నడిపిస్తున్నట్లుగా వెలుగుచూసింది. దీంతో రమేష్ ,మహేష్ లను పట్టుకోవడానికి పోలీసులు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. పది పదిహేను రోజుల నుంచి ముంబై, బెంగళూరు, గోవా లాంటి పట్టణాల్లో టాస్కోర్స్ పోలీసులు మకాం వేశారు. అయినప్పటికీ కూడా ప్రధాన సూత్రధారి మహేష్ ఇప్పటివరకు పోలీసులకు చిక్కలేదు. దీంతో తాము అరెస్ట్ చేసిన ఐదుగురు మహిళలతో పాటు నలుగురు డ్రగ్ సప్లయర్స్ ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ ముఠా దగ్గర్నుంచి 260 గ్రాముల బ్రౌన్ షుగర్ తో పాటు 70 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముంబై కేంద్రంగా మహేష్ అన్ని రాష్ట్రాల్లో తన నెట్వర్క్ పెట్టుకున్నాడని పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ముఖ్యంగా గంజాయితో పాటు అన్ని రకాల సింథటిక్ డ్రగ్స్ లను మహేష్ గ్యాంగ్ సరఫరా చేస్తుంది. త్వరలోనే ఈ గ్యాంగ్‌ను పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# కాటేదాన్ లో కల్తీ వ్యాపారం

**హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో ఆహారాన్ని కల్తీ చేస్తూ మార్కెట్ లో విక్రయిస్తున్న ముఠాల ఆగడాలు ఆగడం లేదు. గతంలో ఎన్నో సార్లు అలాంటివారిపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకున్నా, డబ్బులకు ఆశపడుతున్న కొందరు ఆహార కల్తీని కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా సైబరాబాద్ ఎస్ ఓటీ పోలీసులు రంగారెడ్డి జిల్లా కాటేదాన్ లో కల్తీ ముఠాను అరెస్ట్ చేశారు. వారు అనుమతులు లేకుండా అల్లం వెల్లుల్లి పేస్టులను విక్రయిస్తున్నారని గుర్తించారు. కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్, మ్యాంగో కూల్ డ్రింక్స్ తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. 500 కేజీల నకీల అల్లం వెల్లుల్లి పేస్టు, ఒక టన్ను వెల్లుల్లితో పాటు లిటిల్ చాప్స్ పేరుతో అమ్మే మ్యాంగో డ్రింక్ ను కూడా ఎస్ఓటీ సీజ్ చేశారు. కాటేదాన్ లో ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాలో ఎలాంటి అనుమతులు లేకుండానే గత కొన్ని రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా ఈ కల్తీ వ్యాపారం జరుగుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. మురికి ప్రాంతంలో కుళ్లి పోయిన అల్లం, వెల్లుల్లితో పేస్టును నిర్వాహకులు తయారు చేస్తున్నట్లుగా గుర్తించారు. అల్లం వెల్లుల్లి పేస్టు ఘాటుగా ఉండడానికి అల్లం వెల్లుల్లి పేస్టులో అసిటిక్ యాసిడ్ తో పాటు ప్రమాదకరమైన రసాయనాలు కలుపుతున్నారు. మెషినరీలో కుళ్లి పోయిన అల్లం, వెల్లుల్లితో పాటు వెల్లుల్లి పాయల పొట్టును కూడా కలుపుతూ పేస్ట్ తయారీ చేస్తున్నట్లు గుర్తించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ కల్తీ దందా కొనసాగుతోంది. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు పరిశ్రమపై దాడి చేసి అపరిశుభ్రత, మురుగు నీరు, ప్రమాదకరమైన రసాయనిక పదార్థాలను గుర్తించారు. 500 కేజీల అల్లం, వెల్లుల్లి పేస్టు, భారీగా మ్యాంగో కూల్ డ్రింగ్, ప్రమాదకరమైన రసాయనాలు, తెల్లటి పౌడర్, 210 లీటర్ల అసిటిక్ యాసిడ్, 550 కేజీల నాన్ వెజ్ మసాల ప్యాకెట్స్, టన్ను వెల్లుల్లిని సీజ్ చేశారుహైదరాబాద్ నగరంలోని మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మస్తాన్ నగర్‌లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి నేతృత్వంలో అడిషనల్ డీసీపీ, ఏసీపీ, 11 సెర్చ్ పార్టీలు, దాదాపు 150 మంది పోలీసు సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఇందులో నలుగురు పాత నేరస్తులను గుర్తించగా.. సరైన పత్రాలు లేని నాలుగు వాహనాలు, రెండు బెల్టు షాపులు గుర్తించి 400 కాటన్ల మద్యం బాటిళ్లను సీజ్ చేశారు.ఈ సందర్భంగా డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ.. నలుగురు పాత నేరస్తులను గుర్తించి వారి ప్రస్తుతం ఏ కార్యకలాపాలు చేస్తున్నారో ఆరా తీశామని డీసీపీ తెలిపారు. మస్తాన్ నగర్‌లో 11 సెర్చ్ పార్టీలు, 5 కటాఫ్ పార్టీలతో తనిఖీలు చేశామని చెప్పారు. రెండు బెల్టు షాపులు, అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న షాపులను, క్రాకర్స్ నిల్వ ఉంచిన షాపును గుర్తించామని చెప్పారు. 400 కాటన్ బాక్సుల మద్యం బాటిళ్ళు సీజ్ చేసినట్లు తెలియజేశారు.

# త్వరలో ఓరుగల్లుకు ప్రధాని

**వరంగల్ :**

వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా సరే తెలంగాణ అధికారం దక్కించుకోవాలనుకుంటున్న బీజేపీ రాష్ట్రంలో వరుస పర్యటనలు, కార్యక్రమాలకు సిద్ధం అవుతోంది. ఇప్పటి వరకు కర్ణాటక ఎన్నికల్లో బిజీగా ఉన్న ప్రధాని మోడీ, కేంద్రమంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర ముఖ్య నేతలు.. ఇక తెలంగాణపై ఫోకస్ చేయనున్నారు. కర్ణాటకలో ఎన్నికల ప్రచారం ముగుస్తుండడంతో.. త్వరలో తెలంగాణకు రాబోతున్నట్లు తెలుస్తోంది. దక్షిణాదిలో పార్టీ విస్తరణకు కర్ణాటకలో గెలుపు కీలకం అని అక్కడ ఓట్లు పొందే ఏ అవకాశాన్ని వదులుకోరాదనే వ్యూహం మేరకే సరిహద్దుల్లో సభ నిర్వహించే యోచన ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు. కర్ణాటక ఎన్నికల కోడ్ తో ఇబ్బంది లేకుండా జహీరాబాద్, నారాయణపేట్ లేదా మరోచోట సభ నిర్వహించే అవకాశం ఉందని అంటున్నారు. త్వరలోనే తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో ప్రజలకు దగ్గరయ్యేందుకు అనేక వ్యూహాలు చేస్తున్నారు. కేసీఆర్ సర్కార్ పై విమర్శల దాడిని కొనసాగించడంతో పాటు కేంద్రమంత్రులు, ముఖ్య నేతల పర్యటనల ద్వారా పార్టీ కేడర్ లో ఉత్సాహం నింపాలని భావిస్తున్నారు. కేంద్ర పథకాల ద్వారా వివిధ రంగాల్లో రాష్ట్రానికి కేటాయించి నిధులు, ప్రజలకు కల్గిన లబ్ధి తదితర అంశాలను క్షేత్రస్థాయిలో వివరించాలని నిర్ణయించారు. ఏప్రిల్ 8వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోదీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు వచ్చారు. సికింద్రాబాద్ - తిరుపతి మధ్య నడవనున్న వందేభారత్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను పూర్తిగా కేంద్ర బలగాలు తమ స్వాధీనంలోకి తీసుకుని.. రైల్వే స్టేషన్ తో పాటు పరిసర ప్రాంతాలలో క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెడుతున్న వందేబారత్ సికింద్రాబాద్ నుండి తిరుపతి ఎక్స్ ప్రెస్ రైల్ ను ఈ నెల 8న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం 10 నుండి ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. అలాగే అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులకు కూడా ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 715 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ భూమిపూజ చేశారు. ఇందులో భాగంగా రాబోయే 40 సంవత్సరాల వరకు అవసరమైన సౌకర్యాలను అభివృద్ధి చేస్తారు. రద్దీ సమయంలో 3,25,000 మంది ప్రయాణికులకు కూడా సౌకర్యాలను అందించగలిగేలా రైల్వే స్టేషన్ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. రైల్వే స్టేషన్లో ప్రస్తుతం ఉన్న 11,427 చదరపు మీటర్ల బిల్డింగ్ ఏరియాను అంతర్జాతీయ ప్రమాణాలతో 61,912 చదరపు మీటర్లకు పెంచటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. టెర్మినల్ బిల్డింగ్ నుంచి అన్ని ప్లాట్ ఫామ్స్‌ను కలిపేలా 108 మీటర్ల ప్రత్యేక డబుల్ లెవెల్ వంతెన చేపడుతున్నారు. ఆధునికీకరణ పనులలో భాగంగా ఈస్ట్, వెస్ట్ మెట్రో స్టేషన్లకు, రేతిఫైల్ బస్ స్టేషన్ కు నేరుగా కనెక్టివిటీని పెంచుతారు. మల్టీలెవెల్ కార్ పార్కింగ్, వచ్చే/వెళ్ళే ప్రయాణికులకు ప్రత్యేక మార్గాలను అభివృద్ధి పనులలో భాగంగా చేపడుతున్నారు.

# సబ్సిడీ రుణాల్లో లుకలుకలు

**ఖమ్మం:**

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు ఇస్తున్న వాహనాల సబ్సిడీ రుణాల్లో లుకలుకలు బయట పడుతున్నాయి. వాహన కొనుగోలుదారులకు చుక్కలు చూపెడు తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి ఫైనాన్స్‌లో వాహనాలు తీసుకుంటే సబ్సిడీ అందకుండా, ఫైనాన్సియర్లు వాహనాలు లాక్కెలుతున్నారు. రెండు, మూడు నెలల కిస్తీ చెల్లించలేదని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, సమాచారం ఇవ్వకుండా వాహనాలను వేరేవారికి విక్రయిస్తున్నారు. వచ్చే సబ్సిడీని అందరూ పంచుకుం టున్నారు ..ఖమ్మం పట్టణానికి చెందిన ఓ మహిళ హిందూజా లీలాండ్ ఫైనాన్స్ నుంచి జేసీబీ వాహనాన్ని ఏడు లక్షల రూపాయలు డౌన్ పేమెంట్ చేసి కొనుగోలు చేసింది. మిగతా చెల్లింపులను నెలవారీ వాయిదా పద్ధతిలో చెల్లించేలా అగ్రిమెంట్ చేసుకున్నది. అనంతరం ఆ వాహనం మీద సబ్సిడీ కోసం పరిశ్రమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. దాదాపు 12 నెలలు కిస్తీలు చెల్లించిన తర్వాత మూడు నెలలుగా చెల్లించడంలో జాప్యం జరిగింది. ఈ జాప్యమే లబ్ధిదారుకు శాపంగా మారింది. మూడు నెలలు కిస్తీలు చెల్లించలేదని ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండా ఫైనాన్స్ రికవరీ మేనేజర్ దౌర్జన్యంగా వాహనాన్ని తీసుకెళ్లిపోయారు. వాహనం ఫైనాన్సియర్ తీసుకెళ్లాక సబ్సిడీ వ్యవహారం ఎంతవరకు వచ్చిందో తెలుసుకుందామని లబ్ధిదారు పరిశ్రమల శాఖకు వెళ్లి ఆరా తీయగా అక్కడే ఉన్న ఫైనాన్స్ మేనేజర్ మహిళపై చిందులు తొక్కాడు. కిస్తీలు చెల్లించకపోగా సబ్సిడీ కావాలా అంటూ ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్ లబ్ధిదారున్ని కులం పేరుతో దూషించాడు. పెట్టుబడి పోగా.. వాహనం ఫైనాన్సియర్ తీసుకెళ్లగా.. సబ్సిడీ రాకపోగా.. చివరకు తిట్లు తినాల్సివ చ్చిందని ఆ మహిళ రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా ఈ విషయమై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసింది. కాగా లబ్ధిదారుపై ఫైనాన్సియర్ జరిపిన దూషణ పర్వం మొత్తం జిల్లా పరిశ్రమల శాఖ మేనేజన్ అజయ్ కుమార్ ఎదుటే జరగడం విశేషం.అయితే కొనుగోలు చేసిన అసలు లబ్ధిదారు తన వాహనం ఎక్కడ ఉందన్న విషయమై ఆరా తీయగా.. విస్తుపోయే విషయం వెల్లడైంది. ఆ వాహనం పక్క జిల్లాలో ఉందని తెలియడంతో దాన్ని విక్రయించినట్లుగా సమాచారం అందింది. వాస్తవానికి వాహనం తీసుకెళ్లాక కొనుగోలు చేసిన వారికి సమాచారం అందించి, అందుకనుగుణంగా అగ్రిమెంట్లు రాసుకుని, కట్టిన సొమ్మును కూడా సెటిల్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాంటిదేమీ లేకుండానే వాహన్నాన్ని విక్రయించి దానిపై సబ్సిడీ పొందినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. వచ్చిన సబ్సిడీని అటు వాహనం తీసుకున్న వారికి ఇచ్చారో లేదో తెలియదుకానీ.. పరిశ్రమలశాఖ అధికారి, ఫైనాన్సియర్ నొక్కేసిట్లు తెలుస్తుంది.జిల్లా పరిశ్రమల శాఖలో సబ్సిడీల కోసం దళితుల పేరుతో కొంతమంది ఇతర కులాల వారు లబ్ధి పొందుతున్న ఆరోపణలు వినపడు తున్నాయి. దళితుల వద్ద ఒప్పంద పత్రాలు చేయించుకొని జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది ఇతర కులాల వారు లక్షలలో సబ్సిడీ తీసుకుంటున్నారని విమర్శలు లేకపోలేదు. అంతేకాకుండా జిల్లా పరిశ్రమల శాఖలో ఓ ప్రధాన అధికారి జిల్లా వ్యాప్తంగా ఉన్న కొన్ని ఫైనాన్స్ సంస్థలతో కుమ్మక్కై బాధితుల వాహనాలు ఫైనాన్స్ యాజమాన్యాలు తీసుకుపోవడానికి ప్రధాన కారకుడని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా అనేక మంది బాధితులు దిక్కు తోచని స్థితిలో ఉన్నట్లు తెలుస్తుంది.

# 10న రాష్ట్ర వ్యాప్తంగా పాలిసెట్-2023

**అమరావతి**

రాష్ట్రంలో పాలిసెట్-2023 నిర్వహణకు సర్వం సిద్దం చేసామని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరగనుండగా, రాష్ట్రవ్యాప్తంగా 61 పట్టణ కేంద్రాలు, 499 పరీక్షా కేంద్రాలలో 159144 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 96429 మంది బాలురు, 62715 మంది బాలికలు ఉన్నారని, ఈ పరీక్షకు హాజరువుతున్న బాలికల సంఖ్య మొత్తం విద్యార్థులలో దాదాపు 40శాతంగా ఉందని నాగరాణి వివరించారు. గిరిజన ప్రాంతాలలో చేపట్టిన ప్రత్యేక ప్రచారం ఫలితంగా ఎస్సి విద్యార్థులు 26698 మంది, ఎస్టి విద్యార్థులు 9113 మంది హాజరవుతున్నారన్నారు. సమయపాలన పాటిస్తూ విద్యార్థులు ఉదయం 10 గంటలలోపు పరీక్షా కేంద్రాలకు



చేరుకోవాలని సూచించారు. గత సంవత్సరం (2022)తో పోలిస్తే ఈ సంవత్సరం పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య దాదాపు 21000 పెరిగిందన్నారు. సాంకేతిక విద్యా శాఖ పరంగా చేపట్టిన ప్రత్యేక చర్యలు మంచి ఫలితాలను ఇచ్చినట్లు అయ్యిం దన్నారు. పాలిటెక్నిక్ విద్య ప్రయోజనాలు, తద్వారా అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల గురించి ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించటంలో సఫలీకృతుల య్యారన్నారు. ఇందుకోసం అయా పాఠశాలలో అవగాహనా కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు ప్రేరణ అందిం చారన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్లలో ఉద్యోగ సాధకుల దినోత్సవాన్ని నిర్వహించటంతో, ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు 4000కు పైబడి ప్లేస్మెంట్లు సాధించిన విషయం విద్యార్థి సమాజంలో విస్తరించిందని చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. మునుపెన్నడూ లేని విధంగా పాలీసెట్-2023 పరీక్షకు హాజరయ్యే ఎస్సి, ఎస్టి విద్యార్థులకు ఫీజు రాయితీ ఇవ్వగా, వారికి రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400 ఫీజుగా నిర్ణయించామని కమిషనర్ వివరించారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రధానో పాధ్యా యులు, మండల విద్యాశాఖా ధికారులతో సమావేశాలు నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యపై అవగాహన కల్పించామన్నారు. 84 ప్రభుత్వ పాలిటెక్నిక్లలో 9000 మంది విద్యార్థులకు పాలిసెట్-2023 కోసం ఉచితంగా కోచింగ్ అందించి, స్టడీ మెటీరియల్ ను సైతం ఉచితంగానే అందచేసామని చదలవాడ నాగరాణి వివరించారు.

# బానిసలకంటే హీనంగా జూనియర్ పంచాయితీ సెక్రటరీలు

## ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ

**హైదరాబాద్**

మీ ప్రభుత్వంలో జూనియర్ పంచాయితీ కార్యదర్శుల పరిస్థితి బానిసల కంటే హీనంగా తయారైంది. వాళ్లతో గొడ్డు చాకిరీ చేయించుకోవడమే తప్ప, వారి హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు అయన సీఎం కేసీఆర్ కు ఒక బహిరంగ లేఖ రాసారు. . న్యాయంగా వారికి దక్కాల్సిన హక్కు అయిన. .ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని గత 12 రోజుల నుంచి సమ్మె చేస్తున్న మీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు అయిన లేదు. ఎంత సేపు రాజకీయాలే తప్ప జూనియర్ పంచాయితీ కార్యదర్శుల గోసను పట్టించుకునే సోయి లేకుండా పోయింది.మీ ప్రభుత్వం దేశంలోనే మా పంచాయితీలు ఆదర్శం అందుకే కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తుంది అని గొప్పలు చెప్పుకుంటోంది. ఆ గొప్పల వెనుక పగలనక రాత్రనక కుటుంబాన్ని సైతం పట్టించుకోకుండా జూనియర్ పంచాయితీ కార్యదర్శులు పడిన శ్రమ ఉంది. వారి కష్టంతో రాష్ట్రంలో గ్రామపంచాయితీలకు 79 అవార్డులు వచ్చిన విషయాన్ని మరిచిపోవద్దు. ఇంత చేసి మీకు అవార్డులు తెస్తే వారి సర్వీసులను రెగ్యులర్ చేయకుండా వేధించడం ఎంత వరకు సహేతుకం.



వారి కష్టానికి మీ ప్రభుత్వం ఇచ్చే రీవార్డు ఇదేనా అని ప్రశ్నించారు.

తెలంగాణ వస్తే కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఉండవు అంటూనే 2018 నూతన పంచాయితీరాజ్ చట్టం మేరకు గ్రామాల అభివృద్ధి కోసం బాండ్ లేబర్ మాదిరిగా మూడేళ్ల ప్రొబేషన్ పీరియడ్ తో 2018 జూనియర్ పంచాయితీ కార్యదర్శుల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి 2019 ఏప్రిల్ 12న 9,355 మందిని పలు రకాల షరతులను విధించి రూ. 100 బాండ్ పేపర్ మీద సంతకాలు తీసుకొని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. ప్రొబేషనరీ మూడేళ్ల పీరియడ్ 2022, ఏప్రిల్ 11న పూర్తయింది. అయితే వారిని రెగ్యులర్ చేయకుండా ప్రొబేషన్ టైమ్ మరో ఏడాది పెంచుతున్నట్లు సీఎం హోదా మీరు అసెంబ్లీ లో ప్రకటన చేశారు. ఆ సందర్భంగా అసెంబ్లీ సాక్షిగా ప్రొబేషన్ పీరియడ్ తర్వాత జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తానని మీరు హామీ ఇచ్చారు. దిక్కులేని పరిస్థితుల్లో పంచాయితీ కార్యదర్శులు సమ్మెకు దిగారు. ఇటువంటి సమస్యలను సావధానంగా విని పరిష్కరించాల్సిన ప్రభుత్వమే సమ్మె విరమించి ఉద్యోగాల్లో చేరకుంటే తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడటం మీ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు.గ్రామపంచాయతీ పరిధిలో 56 రకాల విధులను అప్పగించి రోజు 10 నుంచి 12 గంటలపాటు జూనియర్ పంచాయితీ కార్యదర్శులతో వెట్టి చాకిరి చేయించుకుంటోంది మీ ప్రభుత్వం. రోజు రోజుకు నిర్వహించాల్సిన బాధ్యతలు పెరగుతుండటం, మితిమీరిన ఒత్తిడితో పంచాయితీ కార్యదర్శులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ఇప్పటికే స్థానిక రాజకీయాల కారణంగా రాష్ట్రంలో దాదాపు 1500 మంది ఉద్యోగాలు వదిలేశారు. ఇతర అనారోగ్య సమస్యలతో 44 మంది వరకు మృతి చెందారా అన్నారు. మీ దౌర్భగ్యం కారణంగాపంచాయితీ కార్యదర్శులు ఉద్యోగాల రెగ్యులరైజేషన్ కోసం రోడెక్కె పరిస్థితి వచ్చింది. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకే దిక్కులేకపోతే రాష్ట్రంలో పాలన ఉన్నట్టా లేనట్టా! ఇప్పటికైనా పంచాయితీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాల్సిన బాధ్యత మీపైన ఉంది. లేనిపక్షంలో వారి పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలవడమే కాక... వారి తరపున ప్రత్యక్ష కార్యచరణకు సైతం సిద్ధమవుతామని అన్నారు.

## విత్తనాలు విక్రయ దుకాణాల్లో తనిఖీలు

**నందవరం**



మండల పరిధిలో నందవరం నాగలదిని గ్రామంలో విత్తనాల దుకాణాల మంగళవారం సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రి మండల వ్యవసాయ అధికారి స్రవంతి తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు వచ్చిన విత్తనాలు స్టాక్ పరిశీలించి అలాగే దుకాణాల అనుమతి పత్రాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారి మాట్లాడుతూ విత్తనాలను విత్తనాల తయారీ సంస్థలు నిర్ణయించి ధరలకే విక్రయించాలని రైతులు విత్తనాలు కొనుగోలుకు వచ్చినప్పుడు ఒక రకం విత్తనానికి ఇంకొక రకం విత్తనం లింకుగా ఇవ్వరాదని విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతులకు బిల్ తప్పనిసరిగా ఇవ్వాలని అలాగే రైతులకు వారి పొలం బట్టి విత్తనాలను ఇవ్వాలని విత్తన విక్రయదారులను సూచించి నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మే నెలలో ఉన్న అధిక ఉష్ణోగ్రత వలన విత్తన మొలకల శాతం తగ్గి ఆకులు ఎండిబడి రైతులకు తీరని నష్టం జరిగే అవకాశం ఉన్నందున పత్తి విత్తనాలను మే నెలలో నాటుకోవద్దని రైతులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వారి సిబ్బంది. సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ కు కృతజ్ఞతలు

**ఎన్టీఆర్ జిల్లా**

మణిపూర్ లో రిజర్వేషన్ విషయంలో రెండు తెగల మధ్య జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో అక్కడ వివిధ యూనివర్సిటీల్లో చిక్కుకుపోయిన ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విమానాల ద్వారా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య హైదరాబాద్ కు తరలించి , భోజనం ఏర్పాట్లు చేసి, ప్రత్యేక బస్సుల్లో తమ ప్రాంతాలకు చేర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో పెనుగంచిప్రోలు మండలం నబాబు పేటకు చెందిన గొర్రె మచ్చు చందు, వత్సవాయి మండలం భీమవరం చెందిన పెనుగొండ రాజశేఖర్ రెడ్డి, కంబంపాడు చెందిన దేవరశెట్టి వెంకట సాయి లు తమ తమ ఇళ్లకు చేరుకొని సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి , ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి,అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## ది కేరళ స్టోరీ సినిమాతో తల్లితండ్రులు జాగ్రత్త పడాలి-జన జాగరణ సమితి

**విశాఖపట్నం**

ది కేరళ స్టోరీ సినిమాని మానవత్వం, మతోన్మాదానికి సంబంధించిన చిత్రం గా భావించాలని జన జాగరణ సమితి సూచించింది. తల్లిదండ్రులు ఈ చిత్రా న్ని చూసి, తమ పిల్లలు లవ్ జిహాద బారిన పడకుండా జాగ్రత్త పడాలనీ కోరారు. విశాఖ నగరంలోని ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో జనజాగరన సమితి ప్రతినీదీ వాసు మాట్లాడారు. కేరళ స్టోరీ చిత్రంలో చూపించిన నిజాలను కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక కొన్ని రాష్ట్రాలలో సినిమాని బ్యాన్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై నిజ నిజాలు తేల్చేందుకు తాము చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అదేవిధంగా ఇస్లామి క్ పేరుతో మతమార్పిడులకు పాల్ప డుతున్న సంస్థలను కనిపెట్టి వారిని శిక్షించి, కేరళ రాష్ట్రాన్ని ఎన్ఐఏ ఆధీనం లోకి తీసుకోవాలని సమితి డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**నిజామాబాద్**



మంగళవారం వెలువడిన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్మూర్ శాస్త్రి నగర్ కు చెందిన ప్రజ్వల్ పరీక్ష ఫలితాలు విషయమై మనస్థాపానికి గురై ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు హైదరాబాద్ లోని కార్పోరేట్ కాలేజి లో ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు.

## కలెక్టర్ ను కలిసిన పంచాయతీ కార్యదర్శులు

**యాదాద్రి**

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మరియు ఔట్సోర్సింగ్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ పమేల సత్పథి తో సమావేశం అయ్యారు. ఆమెతో చర్చలు జరిపారు. కలెక్టర్ వారికి మంగళవారం సాయంకాలం వరకు గడువు విధించడం జరిగింది. దీంతో జిల్లా కలెక్టర్ ను కలిశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్సోర్సింగ్ వారి న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కలెక్టర్ ను కోరారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు అందరు విధుల్లో చేరాలని జిల్లా కలెక్టర్ వారికి సూచించారు. దీంతో మధ్యాహ్నం రెండు గంటల వరకు సమయం ఇవ్వమని వారు కోరారు..

మిగతా పంచాయతీ కార్యదర్శులు ఔట్సోర్సింగ్ సిబ్బందితో మాట్లాడి ఓ నిర్ణయం చెప్తామని జిల్లా కలెక్టర్కు తెలిసారు.

## శ్రీలక్ష్మి మహా యజ్ఞానికి సీఎంకు ఆహ్వానం

**అమరావతి**



డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, వేద పండితులు మంగళవారం నాడు క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ను కలిసి విజయవాడలో జరగనున్న శ్రీ లక్ష్మి మహా యజ్ఞానికి అహ్వానించారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17 వరకు శ్రీ లక్ష్మి మహా యజ్ఞం జరగనుంది. ఏపీ ప్రభుత్వం?దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మి మహా యజ్ఞం నిర్వహిస్తున్నారు. శ్రీశైలంలో జరగనున్న మహాకుంభాభిషేక మహోత్సవానికి కుడా జీఎం ను ఆహ్వానించారు. శ్రీశైలంలో ఈ నెల 25 నుంచి 31 వరకు మహారుద్ర శతచండీ వేదస్వాహాకార పూర్వక మహాకుంభాభిషేక మహోత్సవం జరగనుంది. ఈ సందర్బంగా ముఖ్యమంత్రి కు వేద పండితులు తీర్థప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వచనం ఇచ్చారు.

## విద్యార్థులను సురక్షితంగా తీసుకు రావడం పై హర్షం

**మదనపల్లె**

మణిపూర్ లో జరుగుతున్న ఘర్షణల్లో చిక్కుకున్న మన రాష్ట్ర విద్యార్థులను సురక్షితంగా తీసుకు వచ్చిన మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. అన్నమయ్య జిల్లాకు చెందిన వారి కుమారుడు మణిపూర్ ఔమి నందు బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న హింసాత్మక ఘటనల గురించి విన్న తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బిడ్డ క్షేమంగా ఇంటికి చేరుకోవాలని ఆ భగవంతున్ని ప్రార్థించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్కడ చదువుతున్న మన రాష్ట్ర విద్యార్థులను సురక్షితంగా తీసుకు రావడం పై హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన కుమారుడు హైదరాబాదుకు చేరుకున్నాడని వివరించారు.

## ఏసీబీ వలలో జీజీహెచ్ జూనియర్ అసిస్టెంట్

**కాకినాడ**

కాకినాడ జీజీహెచ్ జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే సమాచారంతో సోదాలు చేపడుతున్నట్లు ఏసీబీ అదనపు ఎస్పీ సౌజన్య తెలిపారు. సత్యనారాయణ ఇంటితో పాటు అతని కార్యాలయం, బంధువుల ఇళ్లల్లోనూ ఐదు బృందాలుగా విడిపోయి సోదాలు చేస్తున్నట్లు వివరించారు. అతని పనిచేసే జీజీహెచ్లో మొత్తంగా 6 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సత్యనారాయణ నివసించే ప్రాంతంలో పలు ఆస్తులను గుర్తించారు. అలాగే సుమారు 60 కాసులు బంగారం, 860 గ్రాముల వెండి వస్తువులను అధికారులు సీజ్ చేశారు. ఈ సోదాలలో బంగారు, వెండి వస్తువులను, విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ సౌజన్య వెల్లడించారు. వీటి విలువ సుమారు. 7 కోట్లు పైబడి ఉంటుందని ఏఎస్పీ తెలిపారు. సోదాలు అనంతరం సత్యనారాయణను రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

## జేసీబీ లతో దేవుడు విగ్రహాలు కూల్చిన ప్రభుత్వ అధికారులు

**అనంతపురం**

జేసీబీలో ఆలయ విగ్రహాలను ప్రభుత్వ అధికారులు కూల్చిన వైనం వివాదానికి దారి తీసింది. అర్ధరాత్రి సమయంలో అనుమతి లేకుండా దేవుడు విగ్రహాలు ఇలా కూల్చడం పై పలు హిందూ సంఘాలు మండిపడుతున్నాయి. అనంతపురం జిల్లా లో టవర్ క్లాక్ వద్ద ఉన్న వాసవీ ఆలయ ఆర్చ్ కూల్చివేత వివాదాస్పదమవుతోంది. సోమవారం ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అర్ధరాత్రి సుమారు 11 గంటలకు జేసీబీ లతో ఆర్చ్ ను రోడ్ విస్తరణలో భాగంగా కూల్చి వేశారు. కాకపోతే దేవతా విగ్రహాలను కూడా జేసీబీ లతో కూల్చి నందుకు విగ్రహాలు కింద పడి పగిలిపోవడం తో ప్రజలు ఆవేదనకు గురి అవుతున్నారు.

దేవతా విగ్రహాలను మాత్రం తాళ్లతో కట్టి కిందకు దించలేదు అంటూ అనంతపురం జిల్లా వాసులు ఆందోళనావ్యక్తం చేస్తున్నారు. గుడి కూల్చివేత పై వైసీపీ మేయర్ మౌనంగా ఉండడం పలు వివాదాలకు దారి తీస్తాయి అంటూ అనంతపురం జిల్లా ప్రజలు మండిపడుతున్నారు. దేవత విగ్రహాలు ఇలా కూల్చడం సరైన నిర్ణయం కాదు దీని పై మేయర్, జిల్లా ఎమ్మెల్యే స్పందించాలి అంటూ పలు సంఘాలు ప్రభుత్వం పై మండిపడుతున్నాయి. వెంటనే ప్రభుత్వ అధికారులు పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## క్రికెట్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే

**గూడూరు**

చిన్నతనం నుండి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు నిరంతరం కష్టపడాలని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ సూచించారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ల్లూరు జిల్లా క్రికెటర్ అసోసియేషన్ గూడూరు క్రికెట్ క్లబ్ ,అల్లూరు ఆదిశేషారెడ్డి కనుమూరు హరిచంద్ర రెడ్డి,క్రికెట్ క్లబ్ ,సంయుక్తంగా ప్రతి సంవత్సరం సమ్మర్ లో క్రికెట్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తారు ఈ సంవత్సరం నేటి నుండి క్యాంపు ప్రారంభమైంది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వరప్రసాద్ క్రికెట్ ఆడి కోచింగ్ ను ప్రారంభించారు ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ చిన్నతనం నుండి ఏ రంగానైతే ఎంచుకుంటారో దాంట్లో ఉన్నత స్థాయికి వెళ్లేందుకు నిరంతరం కష్టపడాలని విద్యార్థులకు సూచించారు మనకు హాని కలిగించే రెండు లక్షణాలు ఉంటాయని అవి లగ్జరీ ,లేసినెస్ ను జయించి చదువుల్లో గాని క్రీడల్లో గాని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు శ్రీనివాసులు రెడ్డి ,డాక్టర్ జనార్దన్ రెడ్డి , ముని గిరీష్,లవ కుమార్, వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు .

## ఘనంగా రెడ్ క్రాస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**హైదరాబాద్ :**



వరల్డ్ రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ జయంతి ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథులు మన రాష్ట్ర శాసన మండలి సభ్యులు ఎ. వి. యన్ రెడ్డి , ఎ. సి. పి రామదాసు తేజోవత్, టిబి-హైదరాబాద్ కన్వీనర్ డా. బి. విజయ్ భాస్కర్ గౌడ్ , ఇందిరా ప్రియదర్శిని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ , డా. డి. వరలక్ష్మి గారు,రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ అగ్రికల్చర్ మరియు విజిలెన్స్ ఆఫీసర్ , మహేంద్ర రెడ్డి గారు, పవన్ పుత్ర ఎంటర్ ప్రైజర్ యం. డి ఎ. వి రావు , విచ్చేశారు. తెలంగాణ శాసన మండలి సభ్యులు ఎ. వి. యన్ రెడ్డి , జెండాను ఆవిష్కరించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జే ఆర్ సి మరియు వై ఆర్ సి విద్యార్థులకు హెన్రీ డ్యూనాంట్ జయంతి సందర్భంగా సర్టిఫికేట్ లను ఎ. వి. యన్ రెడ్డి , చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఎ. వి. యన్ రెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచి సేవా భావాలను నేర్చు కోవాలని విద్యార్థులకు సూచించారు. నా వంతు సహాయం గా రెడ్ క్రాస్ కు చేస్తాను అని తెలిపారు. ఎ. సి పి రామదాసు తేజోవత్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న భీమ్ రెడ్డి గారిని అభినందించారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగాలని కోరారు. చివరగా భీమ్ రెడ్డి మాట్లాడుతూ మీ అందరి సహాయ సహకారాలు ఉన్నంత వరకు ఈ కార్యక్రమాలు సేవాభావం తో ముందు తీసుకెళ్తామని మరియు మానవతా దృక్పథంతో దాతలు ముందుకు వచ్చి క్షయ వ్యాధి రోగులు కు విరాళాలు అందించి ప్రాణ దాత లు కావాలని పిలుపునిచ్చారు. భీమ్ రెడ్డి గారు ప్రత్యేకం గా ఠాగూర్ స్కూల్ యాజమాన్యం మరియు విద్యార్థులు కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ విజయ కుమారి, యం సి సభ్యులు అనురాధ, రియాజుద్దీన్, వినయ్ కిశోర్, సందేష్ హార్ద, అరుణ్ రవి నాదన్, వై. ఆర్ సి కన్వీనర్ ఉదయ్ శ్రీ, జె.ఆర్ సి కన్వీనర్ కళావతి మరియు విద్యార్థులు, డివిజన్ కన్వీనర్ ధర్మ తేజ, మండల కన్వీనర్ ఆయూబ్ ఖాన్, ప్రవీణ్ కుమార్, మాజీద్, జ్యోతి వాలంటీర్లు కార్యాలయ సిబ్బంది లక్ష్మి, వెంకట్, మహేంద్ర రెడ్డి, సత్య లక్ష్మి, మమత, అనిత, నహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యప్రదేశ్ లో ఘోర బస్సు ప్రమాదం

**భోపాల్:**

మంగళవారం తెల్లవారుజామున వంతెన పై నుంచి బస్సు పడిన ఘటనలో 22 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. 31మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఖోరేగావ్ జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో చనిపోయిన వారిలో ముగ్గురు చిన్నారులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. డోంగార్గావ్ సమీపంలోని బరోడ్ నదిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సు ఖోరేగావ్ నుంచి ఇండోర్కు వెళ్తోంది. వంతెనపై బస్సు అదుపు తప్పి నదిలో పడిపోయింది. నీరు లేకపోవడంతో నేరుగా భూమిని తాకింది బస్సు. రమాద సమయంలో బస్సులో దాదాపు 80మందికిపైగా ఉన్నారు. చనిపోయిన వారిలో బస్సు డ్రైవర్, క్లీనర్ కూడా ఉన్నారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరిని మెరుగైన వైద్యం కోసం ఇండోర్కు తరలించే ప్రయత్నాలు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంపై మధ్యప్రదేశ్ సీఎం శివ్రాజ్ సింగ్ చౌహన్ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. తీవ్రంగా గాయపడినవారికి రూ.50 వేలు, స్వల్పంగా గాయపడినవారికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు.

# జనగామ ఎమ్మెల్యే పై కూతురు కేసు నమోదు

**కరీంనగర్ :**

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిపై ఉప్పల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. ఆయన కుమార్తె తుల్జా భవాని రెడ్డి ఈ కేసు పెట్టడం సంచలనంగా మారింది. సిద్దిపేట జిల్లా చేర్యాలలో తన సంతకాన్ని ఫోర్జరీ చేసి, ఎకరా ఇరవై గుంటల భూమిని తన పేరు మీద తీకుసున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎప్పటి నుంచో ఈ భూమిపై తీవ్ర వివాదం నడుస్తోంది. చెరువు భూమిని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కబ్జా చేశారంటూ విపక్షాల ఆరోపించాయి. అంతేకాకుండా పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా నిర్వహించాయి. అయితే ఇదే విషయమై తాజాగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కుమార్తె తుల్జా భవాని రెడ్డి ఫిర్యాదు చేయడంతో ఈ భూవివాదం మరోసారి తెరపైకి వచ్చింది. భవాని రెడ్డి ఫిర్యాదుపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సెక్షన్ 406, 420, 463, 464, 468, 471 ఆర్/డబ్ల్యూ 34ఐపీసీ, 156(3) సీఆర్పీసీ ప్రకారం కేసులు నమోదు అయ్యాయి. తన కూతురు తనపైనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంపై జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి స్పందించారు. ఈ విషయంపై మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ప్రత్యర్థులు కావాలనే కుట్ర పన్ని తమ కుటుంబంలో చిచ్చులు పెట్టాలని చూస్తున్నారని ముత్తిరెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. చేర్యాలలోని సర్వే నంబర్ 1402లో 1200 గజాల స్థలం తన కూతురు పేరుపై రిజిస్టర్ చేసిందని.. ఇందులో ఎలాంటి ఫోర్జరీ లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. హైదరాబాద్ ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తన కూతురు పేరు మీద 125 నుండి 150 గజాల స్థలం ఉందని.. అందులోనూ ఎలాంటి ఫోర్జరీ లేదని చెప్పుకొచ్చారు. కిరాయి నామా దస్తావేజు తనకు తెలియకుండా తన కుమారుడు మార్చారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి వెల్లడించారు. వివాదాలకు కేరాఫ్ అడ్రస్ మారారు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి. ఖాళీ జాగా కనిపిస్తే ముత్తిరెడ్డి కబ్జా చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. నోటి దురుసుతనం, వ్యవహార శైలితో అటు నియోజకవర్గంలోనూ ఇటు బయట కూడా విమర్శలు ఎదుర్కొంటున్నారు ముత్తిరెడ్డి. యశ్వంతపూర్ లో బతుకమ్మ కుంట 6 ఎకరాల భూమిని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ఆక్రమించారని గతంలో హైకోర్టుకు వెళ్లారు మాజీ సర్పంచ్. బతుకమ్మకుంట భూఆక్రమణపై అప్పటి కలెక్టర్ దేవసేనతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కి గొడవ కూడా జరిగింది. నర్మెట్ట మండలం హన్మంతపూర్ శివారులో ప్రభుత్వ భూమి 70 ఎకరాలను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కబ్జా చేశారని ఆరోపణలు ఉన్నాయి. చేర్యాల మండల కేంద్రంలోని అంగడి స్థలం ఎకరం 20 గుంటలను ఆక్రమించి ముత్తిరెడ్డి ప్రహరీ నిర్మించారని విమర్శలు వచ్చాయి. ఇదే విషయంపై గతంలో అఖిలపక్షం ఆందోళనకు దిగి చేర్యాల బంద్ కు పిలుపునిచ్చింది. గొల్ల కురుమలు జీవనోపాధి కోసం కొనుగోలు చేసిన భూమిని కూడా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి వదల్లేదని ఆరోపణలు ఉన్నాయి.

### కంట తడి పెట్టిన ఎమ్మెల్యే

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కంటతడి పెట్టుకున్నారు. కూతురు తుల్జాభవాని చేసిన ఫిర్యాదుపై వివరణ ఇచ్చే క్రమంలో భావోద్వేగానికి లోనయ్యారు..తన కూతురు భూమి ఎక్కడా ఫోర్జరీ కాలేదని.. ఆస్తి తనపేరు మీదనే ఉందని స్పష్టం చేశారు. కేవలం లీజ్ అగ్రిమెంట్ను మాత్రమే పొడిగించామన్నారు .తమ కుటుంబ సమస్యని రాజకీయ ప్రత్యర్థులు పావుగా వాడుకుంటున్నారుని ఆరోపించారు ముత్తిరెడ్డి. ఎలక్షన్ల ముందు కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తూ కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. తన ఇంటి సమస్యను ప్రజాజీవితానికి ఆపాదించడం సరికాదని చెప్పారు ముత్తిరెడ్డి..ఉప్పల్ పీఎస్లో ముత్తిరెడ్డిపై కూతురు తుల్జాభవాని రెడ్డి ఫిర్యాదు చేశారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసి సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఉన్న భూమిని లాక్కున్నారని ఆరోపించారు.గతంలోనూ ఈ భూమిపై వివాదం నడిచింది. చెరువు భూమిని ఎమ్మెల్యే కబ్జా చేశారంటూ విపక్షాలు ఆరోపించాయి. ఇప్పుడు కూతురు తుల్జాభవానీ రెడ్డి ఫిర్యాదు చేయడంతో మరోసారి భూ వివాదం తెరపైకి వచ్చింది.

# విజువల్ ఫీస్ట్ లా ఆదిపురుష్ ట్రైలర్

ప్యాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్, కృతి సనన్ సీతారాములుగా నటించిన సినిమా ఆదిపురుష్. సైఫ్ అలీఖాన్, సన్నీ సింగ్, దేవదత్త నాగే, వత్సల్ సేన్, సోనాల్ చౌహాన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ఇది. ఓమ్ రౌత్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ ట్రైలర్ విడుదలైంది. అంచనాలకు భిన్నంగా ట్రైలర్ ఈ సారి అద్భుతం అనే టాక్ తెచ్చుకుటోంది. ఏ.ఎమ్.బి మాల్ లో జరిగిన ట్రైలర్ ప్రివ్యూ కు మూవీ టీమ్ మొత్తం హాజరైంది. ట్రైలర్ విజువల్ వండర్ లా ఉంది. హనుమంతుడి కోణంలో సాగే కథలా ఈ ట్రైలర్ ఆరంభంలోనే కనిపిస్తుంది.



"ఇది నా రాముడి కథ. ఆయన మనిషిగా పుట్టిన భగవంతుడైన మహనీయుడు. ఆయన జీవితం ధర్మానికి, సన్మార్గానికి నిదర్శనం. ఆయన నామం రాఘవ. ఆయన ధర్మం అధర్మానికి ఉన్న అహంకారాన్ని అంతం చేసింది. ఇది ఆ రఘునందుడి గాథ. యుగయుగాల్లోనూ సజీవం.. జాగ్రుతం. నా రాఘవుడి కథే రామాయణం.. " అంటూ హనుమంతుడు చెబుతుండగా ట్రైలర్ ప్రారంభం అవుతుంది. ఆ వెంటనే భిక్షాందేహీ అంటూ రావణుడు ఎంట్రీ.. సీతను ఎత్తుకుపోవడం కనిపిస్తుంది. సీత తీసుకు రావడానికి లక్ష్మణుడు అయోధ్య సైన్యాన్ని తీసుకువద్దాం అని చెబుతాడు. అది మర్యాద కాదంటూ రాముడు వద్దంటాడు. సీత తనకు ప్రాణమే అయినా.. ప్రాణం కంటే మర్యాదే ముఖ్యం అని చెప్పడం రాముడి పాత్ర ఔచిత్యాన్ని సూచిస్తుంది. ట్రైలర్ ను బట్టి చూస్తే ఆదిపురుష్ రామాయణ కావ్యం మొత్తం కాకుండా కేవలం సీతాపహరణం ఎపిసోడ్ ను మాత్రమే చూపించేలా కనిపిస్తోంది. చివర్లో వచ్చిన రామ రావణ యుద్ధానికి నేటి ఆధునిక టెక్నాలజీని జోడించినట్టు కనిపిస్తోంది. ఇది సినిమాకు ప్రధాన బలంగా ఉండే అవకాశం ఉంది. విజువల్స్ పరంగా సింప్లీ సూపర్బ్. మొదట్లో వచ్చిన విమర్శలకు దీటైన జవాబులా విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ కనిపిస్తున్నాయి. రాముడు ప్రభాస్, సీతగా కృతి సనన్ జోడీ బావుంది. ఇక 2023లో మోస్ట్ అవెయిటెడ్ మూవీగా ఉన్న ఈ చిత్రం జూన్ 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. ప్రభాస్, కృతిసనన్, సైఫ్ అలీఖాన్, సన్నీ సింగ్, దేవదత్త నాగే, వత్సల్ సేన్, సోనాల్ చౌహాన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఆదిపురుష్ జూన్ 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది.

# 'ఛాంగురే బంగారురాజా' నుంచి సామిరంగ పాట విడుదల

మాస్ మహారాజా రవితేజ యువ, ప్రతిభావంతులైన ఫిల్మ్ మేకర్స్ తో కంటెంట్-రిచ్ సినిమాలను తీయడానికి ఆర్టీ టీమ్‌వర్క్స్ ని స్థాపించారు. ఆర్ టీ టీమ్‌వర్క్స్ లేటెస్ట్ ప్రొడక్షన్ "ఛాంగురే బంగారురాజా". ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి చిత్రాన్ని రవితేజ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సతీష్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. శ్వేత కాకర్లపూడి, షాలిని నంబు ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యుసర్స్.



'అ/ా కంచరపాలెం', 'నారప్ప' ఫేమ్ కార్తీక్ రత్నం కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో గోల్డీ నిస్సీ కథానాయిక. రవిబాబు, సత్య ఈ చిత్రంలో ఇతర ప్రధాన తారాగణం. ఇటీవలే విడుదల చేసిన ఈ చిత్రం టీజర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది.

తాజాగా ఈ చిత్రం ఫస్ట్ సింగల్ సామిరంగా పాటనివిడుదల చేశారు మేకర్స్. కృష్ణ సౌరభ్ ఈ పాటని క్యాచి ట్యూన్ గా కంపోజ్ చేశారు. అనురాగ్ కులకర్ణి, నిత్యశ్రీ వెంకటరమణన్ పాడిన ఈ పాటకు కృష్ణ చైతన్య ఆకట్టుకునే సాహిత్యం అందించారు. ఈ పాటలో కార్తీక్ రత్నం డ్యాన్స్ మూమెంట్స్ అలరించాయి.

ఈ చిత్రం కోసం సతీష్ వర్మ కామెడీ ఎంటర్‌టైనర్‌లో ఫ్రెష్ క్రైమ్ జానర్‌ని ఎంచుకున్నాడు. ఈ చిత్రానికి సుందర్ ఎన్‌సి సినిమాటోగ్రఫర్ గా పని చేస్తున్నారు. జనార్ధన్ పసుమర్తి డైలాగ్స్ రాసిన ఈ చిత్రానికి కార్తీక్ వున్నవా ఎడిటర్.ఛాంగురే బంగారురాజా విడుదలకు సిద్ధమవుతోంది.

నటీనటులు: కార్తీక్ రత్నం, సత్య, రవిబాబు, గోల్డీ నిస్సీ, నిత్య శ్రీ, ఎస్తర్ నోరోన్హా, అజయ్ తదితరులు.

# బ్యూటీఫుల్ మెలోడియస్ గా ఖుషీ మూవీ సాంగ్

డాషింగ్ హీరో విజయ్ దేవరకొండ బర్త్ డే స్పెషల్ గా ఖుషీ మూవీ నుంచి ఓ బ్యూటీఫుల్ మెలోడియస్ సాంగ్ ను విడుదల చేసింది మూవీ టీమ్. శివ నిర్వాణ డైరెక్షన్ లో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. వాటిని రెట్టింపు చేసేలా విజయ్ దేవరకొండ బర్త్ డే స్పెషల్ సాంగ్ కనిపిస్తోంది. హేషమ్ అబ్దుల్ వాహబ్ స్వరపరిచి ఈ పాటను తనే పాడాడు.



ఈ గీతాన్ని దర్శకుడు శివ నిర్వాణ రాయడం ఓ విశేషమైతే.. " నా రోజా నువ్వే.. నా దిల్ సే నువ్వే, నా అంజలి నువ్వే గీతాంజలి నువ్వే" అంటూ పాట మొత్తంలో లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం సినిమాల పేర్లు కలిసి వచ్చేలా సాహిత్యం ఉండటం మరో విశేషం. 'నా కడలి కెరటంలో ఓ మౌనరాగం నువ్వేలే.. నీ అమృపు జడిలో ఓ ఘర్షణే మొదలైంది.. ", నా ప్రేమ పల్లవిలో నువ్వు చేరవే అనుపల్లవిగా.. నీ గుండె సడి లయలో.. నే మారనా నీ ప్రతిధ్వనిగా.. " అంటూ మంచి సాహిత్యం కూడా ఈ పాటలో కనిపిస్తోంది.

ఏ సినిమా నుంచి అయినా మొదటి పాట వస్తోందంటే అది ఆ మూవీ ఫ్లేవర్ ను తెలియజేస్తుంది. ఖుషీ నుంచి వచ్చిన ఈ గీతం కూడా ఓ ప్లెజెంట్ లవ్ స్టోరీని చూడబోతున్నాం అనేలా కనిపిస్తోంది. శివ నిర్వాణే నృత్యరీతులు సమకూర్చిన ఈ గీతాన్ని కశ్మీర్ లోని అందమైన లొకేషన్స్ లో చిత్రీకరించారు.

సమంత ఓ కశ్మీరి యువతిగా కనిపిస్తోంది. తన ప్రేమను గెలుచుకునే యువకుడుగా విజయ్ నటించాడు. వీరి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా కుదిరిందని పాట చూస్తే అర్థమౌతోంది. ఫస్ట్ సాంగ్ తోనే బెస్ట్ ఇంప్రెషన్ వేసిన ఖుషీ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మళయాల భాషలతో పాటు హిందీలోనూ సెప్టెంబర్ 1న విడుదల చేయబోతున్నారు.

నటీనటులు:

విజయ్ దేవరకొండ, సమంత, జయరాం, సచిన్ ఖేడేకర్, మురళీ శర్మ, లక్ష్మీ, అలీ, శరణ్య పొన్ వణ్నన్, రోహిణి, వెన్నెల కిషోర్, రాహుల్ రామకృష్ణ, శ్రీకాంత్ అయ్యంగార్, శరణ్య ప్రదీప్ తదితరులు.

# విజయ్ దేవరకొండ పుట్టినరోజు కానుకగా 'విడి12' నుంచి ప్రత్యేక పోస్టర్

యువ సంచలనం విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి ఓ చిత్రాన్ని రూపొందిస్తోంది. విజయ్ దేవరకొండ కెరీర్ లో 12వ సినిమాగా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్. నాగ వంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మే 3న సినీ ప్రముఖుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది.



నేడు(మే 9) విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శు భాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఓ ప్రత్యేక పోస్టర్ ను విడుదల చేశారు. ఆ పోస్టర్ చాలా క్రియేటివ్ గా ఉంది. పియానోని తలపిస్తూ పేర్చిన కాగితపు ముక్కలపై కథానాయకుడి రూపం కనిపించడం ఆకట్టుకుంటోంది. కథానాయకుడి కళ్ళలో ఇంటెన్స్ కనిపిస్తోంది.పోస్టర్ ను రూపొందించిన తీరు చూస్తుంటే సినిమా చాలా కొత్తగా ఉండబోతుందని అర్థమవుతోంది.

గతంలో గౌతమ్ తిన్ననూరి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ 'జెర్సీ' చిత్రం కోసం జతకట్టారు. ఈ సినిమా విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్ళు రాబట్టి ఘన విజయం సాధించింది. 'జెర్సీ' సినిమా ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ అవార్డు కూడా గెలుచుకుంది. ఇప్పుడు ఈ ప్రతిభకు, అతి కొద్ది కాలంలోనే దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న విజయ దేవరకొండ తోడయ్యారు. అభిమానుల, ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా అద్భుతమైన చిత్రాన్ని అందిస్తామని చిత్ర బృందం నమ్మకంగా చెబుతోంది.

ఈ చిత్రంలో విజయ్ సరసన నాయికగా శ్రీలీల నటిస్తున్నారు. తన అందం, అభినయం, నాట్యంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈ యువ తార మొదటిసారి విజయ్ తో జోడీ కడుతుండటం విశేషం. ఇక 'జెర్సీ'లో తన సంగీతంతో కట్టిపడేసిన అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. 'జెర్సీ'తో జాతీయ అవార్డును అందుకున్న నవీన్ నూలి ఎడిటర్ గా పని చేయనున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ గా గిరీష్ గంగాధరన్, ఆర్ట్ డైరెక్టర్ గా అవినాష్ కొల్లా వ్యవహరిస్తున్నారు. ఇలా ఎందరో ప్రతిభావంతులు కలిసి పని చేస్తున్న ఈ సినిమా షూటింగ్ జూన్ నుండి ప్రారంభం కానుంది.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950